

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | శుక్రవారం 26-6-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 285 | పేజీలు: 4 | వెల: రూ.1/-

## భారత్‌లో పెరుగుతున్న కరోనా కేసులు

### 24 గంటల్లో కొత్తగా 16,922 కేసులు నమోదు

న్యూఢిల్లీ,జూన్25(ఆర్ఎన్ఎ): భారత్‌లో కరోనా కేసులు రోజురోజుకు మరింత పెరిగిపోతున్నాయి. దేశంలో రికార్డు స్థాయిలో కరోనా కేసులు నమోదయ్యాయి. కరోనా వైరస్ విజృంభించి దేశాన్ని కలవరపెడుతోంది. రోజురోజుకు కేసుల సంఖ్య విపరీతంగా పెరుగుతూ సరికొత్త రికార్డులు నమోదు అవుతున్నాయి. దేశంలో రికార్డు స్థాయిలో కరోనా కేసులు నమోదయ్యాయి. గురువారం ఉదయం కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ విడుదల చేసిన హెల్త్ బులెటిన్ ప్రకారం గడిచిన 24 గంటల్లో కొత్తగా 16,922 కరోనా పాజిటివ్ కేసులు వెలుగుచూడగా.. 418 మంది మృత్యువాత పడ్డారు. దేశంలో ఒక్కరోజులోనే దాదాపు 17వేలకు చేరువలో కేసులు నమోదు కావడం ఇదే మొదటిసారి. తాజాగా వచ్చిన కేసులతో కలిపి దేశంలో ఇప్పటివరకు 4,73,105 కేసులు నమోదు కాగా, మరణాల సంఖ్య 14,894గా ఉంది. కరోనా వైరస్ నుంచి 2,71,696 మంది పూర్తిగా కోలుకొని డిశ్చార్జ్ అయ్యారు. ప్రస్తుతం దేశంలో 1,86,514 యాక్టివ్ కేసులు ఉన్నాయి.

గురువారం ఉదయం కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ విడుదల చేసిన హెల్త్ బులెటిన్ ప్రకారం గడిచిన 24 గంటల్లో కొత్తగా 16,922 కరోనా పాజిటివ్ కేసులు వెలుగుచూడగా.. 418 మంది మృత్యు వాత పడ్డారు. దేశంలో ఒక్కరోజులోనే దాదాపు 17వేలకు చేరువలో కేసులు నమోదు కావడం ఇదే మొదటిసారి. తాజాగా వచ్చిన కేసులతో కలిపి దేశంలో ఇప్పటివరకు 4,73,105 కేసులు నమోదు కాగా, మరణాల సంఖ్య 14,894గా ఉంది. కరోనా వైరస్ నుంచి 2,71,696 మంది పూర్తిగా కోలుకొని డిశ్చార్జ్ అయ్యారు. ఇప్పటి వరకూ కరోనా నుంచి 2,76 లక్షల మంది కోలుకున్నారు. భారత్‌లో 1,86,517 యాక్టివ్ కేసులు ఉన్నాయని కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. రోజురోజుకూ కేసులు పెరుగుతుండటం ఆందోళన కల్గిస్తోంది. ఢిల్లీలో ప్రపంచంలోని ఇతర నగరాల కంటే ఒక్క రోజులో అత్యధికంగా కరోనా కొత్తకేసులు నమోద య్యాయి. ఢిల్లీలో సావోపాలో (బ్రెజిల్), శాంటియాగో (చిలీ), లిమా (పెరు) నగరాల కంటే అత్యధిక కరోనాకేసులను నమోదయ్యాయి. లాటిన్ అమెరికాలోని ఈ మూడు మెట్రోపాలిటన్ నగరాలు గ్లోబల్ కోవిడ్ –19 హాట్‌స్పాట్‌లుగా ఉన్నాయి. జూన్ 23న న్యూయార్క్, మాస్కోలో నమోదైన కొత్త కేసులకు మించి ఢిల్లీలో కేసులు నమోదయ్యాయి.

# ఊరూవాడా పచ్చదనానికి జైకొట్టిన జనం

### నర్సాపూర్ అర్బన్ పార్కులో మొక్కనాటిన సిఎం కేసీఆర్
### ప్రజలంతా భాగస్వామ్యం కావాలంటూ సందేశం
### బల్కంపేటలో మొక్కలు నాటిన కేటీఆర్, తలసాని
### గోషామహల్‌లో మహ్మూద్ అలీ..వరంగల్‌లో ఎర్రబెల్లి, సత్యవతి రాథోడ్
### ఆరోవిడత హరితహారంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు
### ఉత్సాహంగా సాగిన తెలంగాణ మొక్కల పండగ

హైదరాబాద్,జూన్25(ఆర్ఎన్ఎ): సిఎం కేసీఆర్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆరో విడుత హరితహారం కార్యక్రమం అట్టహాసంగా మొదలయ్యింది. రాష్ట్ర వ్యాప్తంగా దీనిని జోరుగా కొనసాగిస్తున్నారు. సిఎం కెసిఆర్ ఈ కార్యక్రమాన్ని మెదక్ జిల్లా నర్సాపూర్ అర్బన్ పార్కులో అల్ల నేరేడు మొక్కను నాటి ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ హరిత తెలంగాణలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా సిఎం సందేశం ఇచ్చారు.

సిఎం నేరుగా నర్సాపూర్ చేరుకోగానే మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, హరీష్ రావు, స్థానిక ఎమ్మెల్యేలు మదన్ రెడ్డి, పద్మాదేవేందర్ రెడ్డి, ఎంపి ప్రభాకర్ రెడ్డి,మాజీమంత్రి సునీతా లక్ష్మారెడ్డి, అటవీశాఖ ముఖ్య అధికారి శోభ, కలెక్టర్ ధర్మారెడ్డి తదితరులు స్వాగతం పలికారు. నేరుగా పార్క్‌కు వెళ్లిన సిఎం అల్లనేరేడు మొక్కను నాటి నీళ్లు పోశారు. అలాగే మంత్రులు, అధికారులు కూడా మొక్కలు నాటారు.

ఇకపోతే ఆయా జిల్లాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు ఎక్కడిక్కడ మొక్కలు నాటారు. హరిత తెలంగాణగా రాష్ట్రాన్ని మార్చాలన్న సీఎం కేసీఆర్ ఆశయానికి అనుగుణంగా అందరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. మొక్కల పెంపకాన్ని సామాజిక బాధ్యతగా చేపట్టి విరివిగా మొక్కలు నాటి రేపటి తరానికి స్వచ్ఛమైన గాలిని అందించాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ బల్కంపేట శ్మశాన వాటికలో మంత్రి కేటీఆర్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, మేయర్ బొంతు రామ్మోహన్ పాల్గొన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 9వ వార్డు ఎన్టీఆర్ కాలనీలోని పార్కు వద్ద మంత్రి జగదీష్ రెడ్డి మొక్కలు నాటారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపీ మలోతు కవిత, డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్ మొక్కలు నాటి నీళ్లు పోశారు. జోగులాంబ జిల్లా ఇటిక్యాలలోని బీచుపల్లి ఆలయ ప్రాంగణంలో మంత్రి నిరంజన్ రెడ్డి మొక్కలు నాటారు. నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలం పచ్చలకూడలో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఎమ్మెల్సీలు, రాజేశ్వర్, ఆకుల లలితతో కలిసి మొక్కలు నాటారు. ఖమ్మం జిల్లాలో లకారం ట్యాంక్ బండ్ పై మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఎమ్మెల్సీ, బాలసాని లక్ష్మీనారాయణతో కలిసి మొక్కలు నాటారు. పెద్దపల్లి జిల్లా రామగుండం కార్పొరేషన్ లో సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ మొక్కలు నాటారు.

గోషామహల్ పోలీస్ గ్రౌండ్‌లో హోంమంత్రి మహమూద్ అలీ మొక్కలు నాటారు. హైదరాబాద్ సిటీ పోలీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హరిత హారంలో హోంమంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ హరితహారాన్ని ప్రారంభించారని... దేశంలోనే హరితహారంలో మొట్టమొదటి రాష్ట్రం తెలంగాణ అని చెప్పుకొచ్చారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయిన తరువాత హరిత తెలంగాణగా మార్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్ ది అని కొనియాడారు. ప్రతి గ్రామం, ప్రతి నగరాలలో హరితహారం చక్కగా కొనసాగుతుందని హోంమంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ టార్గెట్ 30కోట్ల మొక్కలు నాటడం అని...ఆ దిశగా కృషి చేస్తున్నారని అన్నారు. సీఎం కేసీఆర్ వచ్చాక మొక్కలు నాటడంలో ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. ప్రతి ఒక్కరు ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని హోంమంత్రి పిలుపుని చ్చారు. దేశంలో ఎక్కడలేని విధంగా ప్రతి గ్రామం, ప్రతి నగరాలలో అందుబాటులో నర్సరీలు ఏర్పాటు చేశారన్నారు. గోషామహల్‌లో పోలీసులు ఇలాంటి గ్రీనరి కార్యక్రమాలు చేయడం చాలా సంతోషకం"మన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రజలు కరోనాను జయించాలని ఆయన తెలిపారు. రోజురోజుకు కరోనా కేసులు పెరుగుతున్న తరుణంలో ప్రజలు ప్రభుత్వానికి సహకరించి... ప్రభుత్వ సూచనలను పాటించాలని కోరారు. కరోనాను జయించడానికి సీఎం కేసీఆర్ అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. కరోనా విజృంభిస్తున్న ఈసమయంలో పోలీసులు ఎంతో చాకచక్యంగా పనిచేశారని హోంమంత్రి మహమూద్ అలీ అభినందించారు. ఆరో విడత తెలంగాణకు హరిత హారం కార్యక్రమంలో భాగంగా వరంగల్ జిల్లాలోని గీనుకొండ మండలం మరియపురం క్రాస్ రోడ్డు నుంచి చేలపర్తి గ్రామం వరకు 14కి.మీ. మేర మొక్కలు నాటే కార్యక్రమాన్ని పంచాయతీరాజ్ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి దయాకర్ రావు మాట్లాడుతూ హరిత హారంలో నాటిన మొక్కలను వంద శాతం బతికించాలన్నారు. మొక్కలను సంరక్షించని ప్రజాప్రతినిధులు, అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరు మొక్కలను రక్షించడమే ధ్యేయంగా గ్రామాల్లో పని చేయాలని ఆయన సూచించారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా ఊరూరా మంకీ ఫుడ్ కోర్టులు, యాదాద్రి మోడల్, విలేజ్ పార్కులను కూడా ఏర్పాటు చేయాలని మంత్రి చెప్పారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. భావితరాల



భవిష్యత్తు కోసం హరితహారం కార్యక్రమం అని చొప్పదండి నియోజకవర్గ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. హరితహారం ఆరవ విడత కార్యక్రమంలో భాగంగా చొప్పదండి పట్టణంలో చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొక్కలు నాటి నీళ్లు పోశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆకాంక్షకు అనుగుణంగా హరితహారం కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఆకుపచ్చ తెలంగాణ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 6వ విడత హరితహారం కార్యక్రమంలో భాగంగా చొప్పదండి పట్టణంలో మొక్కలు నాటడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## ఈచ్‌వన్ ప్లాంట్ వన్ నినాదంతో ముందుకు

### ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కేటీఆర్ పిలుపు

హైదరాబాద్,జూన్25(ఆర్ఎన్ఎ): 'ఈచ్ వన్ ప్లాంట్ వన్' అనే నినాదంతో ప్రతిఒక్కరు మొక్కలు నాటాలని పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. భవిష్యత్ బాగుపడాలంటే మొక్కలు నాటాలన్నారు. మన ముందు తరాలకు మనమిచ్చే బహుమతి ఇదేనని గుర్తించాల న్నారు. సనత్‌నగర్ నియోజకవర్గంలోని బోయిగూడలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన పార్కును మంత్రి ప్రారంభిం చారు. ఆరో విడుత హరితహారంలో భాగంగా పార్కులో మొక్కలు నాటారు. అనంతరం బల్కంపేట శ్మశాన వాటికలో, కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని దుండిగల్ సమీపంలో ఔటర్ రింగ్‌రోడ్డు ఎగ్జిట్ నంబర్ 5 వద్ద మొక్కలు నాటారు. ఈ ఏడాది హరితహారంలో భాగంగా హైదరాబాద్ మహానగరపాలక సంస్థ (హెచ్ఎండీఏ) పరిధిలో 12.5 కోట్ల మొక్కలు నాటనున్నామని చెప్పారు. హరితహారంలో ప్రతిఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించుకోవాలని సూచించారు. ఔటర్ రింగ్‌రోడ్డు వెంట థీమ్‌తో మొక్కలు నాటుతున్నామని తెలిపారు.




హరితహారంలో భాగంగా నగరంలోని బల్కంపేటలో మొక్కలు నాటిన మంత్రి కెటిఆర్.చిత్రంలో మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్, మేయర్ బొంతు రామ్మోమన్ తదితరులు ఉన్నారు

# తెలంగాణ ముమ్మాటికి ధనిక రాష్ట్రమే

### లాక్‌డౌన్ సమయంలోనూ రైతుబంధు డబ్బులు ఇచ్చాం
### పచ్చదనం పరిరక్షణ మనందరి బాధ్యత
### ప్రజాప్రతినిధులంతా పచ్చదనాన్ని పెంచేందుకు కృషి చేయాలి
### అడవులను రక్షించుకున్నప్పుడే కరవును తరిమి కొట్టగలం
### కలప దొంగలను కఠినంగా శిక్షిస్తాం
### ఇకముందు తెలంగాణకు విద్యుత్ సమస్య రాదు
### నర్సాపూర్ హరితహారంలో సిఎం కెసిఆర్

మెదక్,జూన్25(ఆర్ఎన్ఎ): తెలంగాణ ముమ్మాటికి ధనిక రాష్ట్రమేనని మరోసారి ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టం చేశారు. లాక్‌డౌన్ సమయంలోనూ రైతులకు రైతుబంధు డబ్బులు ఇచ్చామని గుర్తుచేశారు. ఉద్యోగులకు, ఎమ్మెల్యేలకు జీతాలు ఆపి గ్రామాలకు డబ్బులు అందించామన్నారు. గురువారం ఆయన ఆరో విడత హరితహారాన్ని మెదక్ జిల్లా నర్సాపూర్‌లో మొక్కలు నాటి ప్రారంభించారు. అనంతరం 15 కోట్లుతో నిర్మించిన అర్బన్ పార్కును సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. పచ్చదనం పరిరక్షణ మనందరి బాధ్యత అన్నారు. ప్రజాప్రతినిధులు పచ్చదనాన్ని పెంచేందుకు కృషి చేయాలన్నారు. ప్రతి గ్రామంలో నర్సరీ ఉన్న ఏకైక రాష్ట్రం తెలంగాణెళి అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. భవిష్యత్ తరాలతో పాటు మనంకూడా మంచి గా బతకాలంటే మొక్కల ఆవశ్యకతను గుర్తించాలన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి, వాటిని సంరక్షించడం ద్వారా అడవులను సృష్టించాలని సిఎం కెసిఆర్ రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు. అడవులను రక్షించుకున్నప్పుడే కరవును తరిమికొట్టవచ్చని ఆయన స్పష్టం చేశారు. గత ఐదు విడతలుగా నిర్వహించిన హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేశారని, ఆరో విడతను కూడా విజయవంతం చేయాలని ఆయన పేర్కొన్నారు. మొక్కలను నాటి వదిలేయవద్దని, వాటిని సంరక్షించినప్పుడే ఈ కార్యక్రమానికి సార్థకత చేకూరుతుందని ఆయన స్పష్టం చేశారు. మన అధికారం మన చేతిలో ఉంటే ఫలితాలు ఇలా ఉంటాయని అందుకు అభివృద్ధి చెందుతున్న తెలంగాణెళి నిదర్శనమని సీఎం కేసీఆర్ అన్నారు. సమిష్టికృషితో నర్సాపూర్ అటవీప్రాంతానికి పునర్జీవం లభించిందన్నారు. స్వయంగా కారు నడుపుతూ తాను ఈ అడవుల్లో తిరిగినట్లు తెలిపారు. నర్సాపూర్ నుంచి సంగారెడ్డి, తూప్రాన్, హైదరాబాద్‌కు ఫియెట్ కారులో తిరిగినట్లు చెప్పారు. సినిమా షూటింగ్‌ల కోసం నర్సాపూర్ అటవీప్రాంతాన్నే ఎక్కువగా ఎంపిక చేసుకునేవారన్నారు. నర్సాపూర్ అడవుల్లో చాలా సినిమాల షూటింగ్‌లు జరిగాయన్నారు. మిషన్ భగీరథతో తెలంగాణలో నీటి సమస్య తీరిందన్నారు. రాష్ట్రంలో విద్యుత్ సమస్య సైతం తీరిందన్నారు. ఇకముందు తెలంగాణకు విద్యుత్ సమస్య రాదన్నారు. రాష్ట్రంలో నాణ్యమన నిరంతర విద్యుత్ అందిస్తున్నట్లు తెలిపారు. గత పాలనలో తెలంగాణలోని అడవులన్నీ తరిగిపోయాయన్నారు. కలప దొంగలను ఎట్టి పరిస్థితుల్లోనూ క్షమించమన్నారు. కలప స్మగ్లర్ల ఆటకట్టించేందుకు ఇంటలిజెన్స్‌లో



ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అడవులను స్మగ్లర్లకు అప్పగించిన పార్టీలే మళ్లీ విమర్శలు చేస్తున్నాయని మండిపడ్డారు. ఇప్పుడు తెలంగాణలో అడవుల పెంపకంపై దృష్టిపెట్టినట్లు సీఎం చెప్పారు. దేశంలో ప్రతి గ్రామంలో నర్సరీ ఉన్న ఏకైక రాష్ట్రం మన తెలంగాణెళి అన్నారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో నర్సరీలు ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీకి ట్యాంకర్, ట్రాలీ అందించినట్లు తెలిపారు. సామాజిక అటవీ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని పిలుపునిచ్చారు. కలప స్మగ్లర్లకు సీఎం కేసీఆర్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. కలప దొంగతనం చేస్తే కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. ఇకపై కలప స్మగ్లర్లను దేశంలో ఎవడూ కాపాడలేడన్నారు. చీమ చిటుక్కుమన్నా తనకు సమాచారం వస్తుందని, వెంటనే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సంకల్పం ఉంటే అన్ని సమకూరుతాయన్న సీఎం గ్రామాలకు పూర్వ వైభవం రావాలని పేర్కొన్నారు. ఆరో విడతలో భాగంగా రాష్ట్రంలో మొత్తం 30 కోట్ల మొక్కలను నాటేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. 34 శాఖలను సమన్వయం చేస్తూ అటవీ శాఖ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఆరో విడత హరితహారం కార్యక్రమం ప్రారంభం కావడంతో రాష్ట్రంలో పండుగ వాతావరణం నెలకొంది.

ఈ కార్యక్రమంలో మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, హరీష్ రావు, స్థానిక ఎమ్మెల్యేలు మదన్ రెడ్డి, పద్మాదేవేందర్ రెడ్డి, ఎంపి ప్రభాకర్ రెడ్డి,మాజీమంత్రి సునీతా లక్ష్మారెడ్డి, అటవీశాఖ ముఖ్య అధికారి శోభ, కలెక్టర్ ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఇప్పటికే ఎక్కడికక్కడ మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గ్రామ గ్రామాన హరితహారం జోరుగా కొనసాగుతుంది. నర్సాపూర్ అర్బన్‌పార్క్‌లో అనేక విశిష్టతలున్నాయి. ఇది ఐదు అటవీ కంపార్ట్‌మెంట్‌లలో 4,380 ఎకరాల అటవీ ప్రాంతం. 630 ఎకరాల్లో ఫారెస్ట్ పార్క్ ఉన్నది. ఇందుకోసం రూ.8 కోట్ల వ్యయంచేశారు. 15 కిలోమీటర్ల మేర రక్షణ ప్రహరీ (సీ త్రూ వాల్, చైన్ లింక్ ఫెన్సింగ్)తో నిర్మాణం జరిగింది. సహజసిద్ధమైన అడవులు, ఎత్తైన కొండలు, పక్షుల కిలకిలరావాలు.. ఎత్తైన వాచ్‌టవర్, ప్రత్యేక ముఖద్వారాలతో నర్సాపూర్ అర్బన్ పార్క్ ప్రకృతి ప్రేమికులను ఆహ్వానిస్తుంటుంది. ఈ అటవీ ప్రాంతం 256 పక్షి జాతులకు నిలయంగా ఉన్నది. తెలంగాణలో 434 పక్షి జాతులుండగా.. అందులో 60 శాతం నర్సాపూర్ అటవీ ప్రాంతంలోనే ఉండటం విశేషం. ఇక్కడ ఉండే 256 పక్షి జాతుల్లో 173 స్థానికమైనవి. మిగతా 83 రకాలు వలస పక్షులు. ఇవి వేసవి, శీతాకాలంలోనే ఇక్కడికి వచ్చి సేదతీరుతుంటాయి.



హైదరాబాద్ గోషామహల్‌లో హరితహారంలో భాగంగా మొక్కలు నాటిన హోంమంత్రి మహ్మూద్ అలీ.

## రాజాసింగ్ సిబ్బందికి కరోనా

### టెస్ట్ రిపోర్టులు త్వరగా వచ్చేలా చేయాలన్న ఎమ్మెల్యే

హైదరాబాద్,జూన్25(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ టెస్ట్‌ల రిపోర్టులను ప్రభుత్వం వీలైనంత త్వరగా ఇవ్వాలని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. 48 గంటల్లో రావాల్సిన రిపోర్టు 5 రోజులైనా రాలేదంటే బాధిత కుటుంబాల్లో అయోమయం నెలకొంటు ందన్నారు. తాజాగా రాజాసింగ్ కారు నడిపే ఇద్దరు డ్రైవర్లకు కరోనా పాజిటివ్ వచ్చింది. మరో ముగ్గురు గన్‌మెన్స్‌కు కూడా కరోనా పాజిటివ్ అని తేలింది. దీంతో ఆయన దగ్గర పనిచేస్తున్న వారంతా భయపడుతున్నారు. ఇప్పటికే రాజాసింగ్ కూడా కరోనా పరీక్షలు చేయించుకోగా.. ఆయనకు నెగిటివ్ వచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ నెల 20న తన దగ్గర పనిచేస్తున్న మరో ఐదుగురికి కూడా కరోనా పరీక్షలు చేయించారు రాజాసింగ్. అయితే వీరి రిపోర్టులు రావాల్సి ఉందని ఆయన తెలిపారు. 48 గంటల్లో కరోనా రిపోర్ట్ వస్తుందని చెప్పారని, తన గన్‌మెన్‌లు టెస్ట్ లు చేనయించుకొనుకొని 5 రోజులైనా ఇంకా రిజల్ట్ రాలేదన్నారు. ఇన్ని రోజులు వరకూ టెస్ట్ రిజల్ట్ రాకపోతే అయోమయం నెలకొంటుందన్నారు. ఒక వేళ పాజిటివ్ వస్తే పరిస్థితి ఏంటని, కుటుంబంలో అందరికీ వస్తుందేమోనని ఆందోళన వ్యక్తం చేశారు.

## ఛత్తీస్‌ఘడ్‌లో వాహనాలకు మావోల నిప్పు

రాయ్‌పూర్,జూన్25(ఆర్ఎన్ఎ): ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు చెలరేగిపోయారు. ఆరు వాహనాలకు నిప్పుపెట్టారు. రోడ్డు నిర్మాణ పనులకు వినియోగిస్తున్న రెండు లారీలు, రెండు జేసీబీలు, రెండు పొ÷–లకైన్లను తగులపెట్టారు. సుక్మా జిల్లాలోని కుకనార్ ప్రాంతంలో బుధవారం ఈ ఘటనకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న సీఆర్పీఎఫ్ దళాలు ఆ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టాయి. మావోయిస్టుల కోసం విస్తృతంగా గాలిస్తున్నాయి.

## కరోనా పరిస్థితులను చక్కదిద్దేందుకు ఉన్నతస్థాయి సమావేశం : యడ్యూరప్ప

బెంగళూరు ,జూన్ 25: రాష్ట్రంలో కరోనా పాజిటివ్ కేసులు పెరుగుతున్నాయని, ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు రాష్ట్ర మంత్రులు, అధికారులతో ఉన్నతస్థాయి సమావేశం ఏర్పాటు చేసినట్లు కర్నాటక ముఖ్యమంత్రి యడ్యూరప్ప గురువారం తెలిపారు. బెంగళూరులో కరోనా పాజిటివ్ కేసులు పెరుగుతున్నాయని, ఈ క్రమంలో కొన్ని ప్రాంతాలను మూసివేసినట్లు చెప్పారు. 'ఈ రోజు మంత్రులు, అధికారుల సమావేశం ఏర్పాటు చేశాం. అక్కడ పరిస్థితిని మరింత చక్కదిద్దే అంశంపై చర్చిస్తాం' అని విలేకరులకు సీఎం చెప్పారు.

బెంగళూరులో బాధితులకు చికిత్సలు అందించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని తెలిపారు. కేసుల సంఖ్య పెరుగుతుందని, దీనిపై సమాలోచనలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు మరో సీల్‌డౌన్‌ను కోరుకోకుంటే భౌతిక దూరం, పరిశుభ్రత పాటించాలని సూచించారు. కాగా, గత సోమవారం సైతం ముఖ్యమంత్రి రాష్ట్రంలో కరోనా పరిస్థితిపై అంచనా వేసేందుకు సమావేశం నిర్వహించారు. కర్ణాటకలో మొత్తం 10,118 కరోనావైరస్ కేసులు నమోదవగా, వీరిలో 6,151 మంది కోలుకోగా, మరో 164 మంది ప్రాణాలు కోల్పోయారు.

### చరిత్రలో నేటినిజం



సీ॥ ప్రియమగు హాస్యము జిలుకుచు
నయముగు నటనమ్ము జూప – నటరాజు ధీటిగనే
రయముగ సంభాషణ పద్ధతి పప్పు చు
జయములు వర్షించె కడల జయసారథిపై!!

(జూన్ 26 హాస్యనటుడు 'సారథి' జననం)



–రాధశ్రీ
సెల్: 9494481210

ప్రసిద్ధ కవి "పాటవెలదుల" సృష్టికర్త
డా॥ వడ్డేపల్లి కృష్ణ
మరియు
నేటినిజం దిన పత్రిక
సంయుక్త ఆధ్వర్యంలో



ప్రతినెలా ఉత్తమ "పాట వెలదుల"కు బహుమతులు

ప్రతినెలా ఉత్తమ పాట వెలదుల్ని రచించిన రచయితలకు
ప్రథమ బహుమతి రూ.1,116/-
ద్వితీయ బహుమతి రూ.750/-
తృతీయ బహుమతి రూ.500/-లతో పాటు
ప్రశంసాపత్రం అందజేయబడును.

'పాట వెలదుల' లక్షణం: ప్రతిపాదంలో 4 పాదాల్లోనూ 5 సూర్యగణాలు (హంస పంచకం) ఉండాలి.

అంటే "ఆటవెలది"లో 2వ, 4వ పాదంలో పాటించే హంస పంచకాన్ని అన్నిపాదాల్లో పాటించాలి.

5 సూర్యగణాల మాత్రల నిడివి 15 మాత్రలు.
మాత్రాగణనం 'పాట' లక్షణం.

హంస పంచకం 'ఆటవెలది'లక్షణం.
ఈ వినూత్న పద్య ప్రయోగానికి "పాటవెలది" అని పేరుపెట్టనైనది.

'పాట వెలది' పద్య ఉదాహరణకు:
**"పల్లెలందు వీచు పైరగాలి
పట్నమందు లేచు పాడుగాలి
ప్రియముగాను మనిషి పీల్చుగాలి
కలుషితమ్ము ఆయె కర్మగాలి"**

ఇలా కనీసం **5 పద్యాల్ని** రచించి 'నేటినిజం' పత్రికకు ప్రతినెలా **20వ తేదీలోగా** పంపించాలి. ప్రతినెల నెలాఖరులో ఫలితాల్ని ప్రకటించి రచయితలకు బహుమతుల్ని **'నేటినిజం'** వేదికగా అందజేయడం జరుగుతుంది.

సందేహాలకు డా॥ వడ్డేపల్లి గారిని 9246541699లో సంప్రదించండి.
రచనలు పంపవలసిన ఈమెయిల్:

**E-mail : netinizam2020@gmail.com**

# దేశానికి ఆర్థిక చికిత్స అవసరం

నేటినిజం
శుక్రవారం 26-6-2020

కరోనాతో మన దేశ ఆర్థిక వ్యవస్థయే కాకుండా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా దిగజారింది. దీంతో ఇప్పుడిప్పుడే ఈ సంక్షోభం నుంచి బయటపడతామా అన్న ఆందోళన నెలకొంది. వివిధ దేశాలు తమ పరిస్థితులకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నాయి. కరోనాను ప్రపంచానికి అంటించి చిద్విలాసంగా ఉన్న చైనా మాత్రం ఎలాంటి బెరుకు లేకుండా తన కార్యకలాపాలను కొనసాగిస్తోంది. ఈ దశలో మనదేశం తీసుకుంటున్న చర్యలు కారణంగా ఇప్పటికైతే ఎలాంటి పురుగతి కనిపించలేదు. వేల కోట్ల ప్యాకేజీ ప్రకటించినా కదలిక కానరావడం లేదు. వసలకూలీలకు మళ్లీ పూర్తిగా పనులు దక్కి..తోపుడుబండ్లు, వీధి వ్యాపారులు వ్యాపారాలు చేసుకునేలా చూడాలి. అయితే ఇలాంటి చర్యలు తీసుకోకుండా పెట్రో ధరలను విపరీతంగా పెంచుకుంటూ పోవడంతో సామాన్య, పేద, మధ్యతరగతి ప్రజలపై తీవ్ర ప్రభావం చూపనుంది.

పెట్రోధరల కారణంగా రవాణారంగంపైనా ప్రభావం పడనుంది. ఇకపోతే బ్యాంకులు అనుసరిస్తున్న తీరు ప్రజలకు శాపంగా మారింది. ప్రజలు బ్యాంకుల వైపు చూస్తే వాతలు పడేలా చేస్తున్నారు. ఇవన్నీ సమీక్షించాల్సి తక్షణ అవసరం కేంద్రంపై ఉంది. ప్రజలు తమంతగా తాము బతికే పరిస్థితులు కల్పించ కుండా వారిపై భారాన్ని మోపి అభివృద్ధి అని చెబితే ప్రజలు నమ్మడానికి సిద్దంగా లేరు. ఇకపోతే ప్రపంచ ఆర్థిక వృద్ధి దాదాపు 5 శాతం క్షీణించనున్నట్లు అంతర్జాతీయ ద్రవ్యనిధి ఐఎంఎఫ్ తాజాగా అంచనా వేసింది. తొలుత అంతర్జాతీయ జీడీపీ 3 శాతం క్షీణతను మాత్రమే చవిచూడనున్నట్లు అభిప్రాయపడింది. అమెరికా, చైనా తదితర దేశాలలో రెండో దశ కోవిడ్-19 కేసులు తలెత్తుతున్న నేపథ్యంలో ఐఎంఎఫ్ తాజాగా అంచనాలు సవరించింది. ఇప్పటికే బీజింగ్‌లో కరోనా కేసులు పెరుగుతుండగా.. న్యూయార్క్, న్యూజెర్సీ తదితర రాష్ట్రాలు సైతం మళ్లీ కోవిడ్-19 బారిన పడుతున్నట్లు గణాంకాలు పేర్కొంటున్నాయి. దీంతో మరోసారి ప్రపంచవ్యాప్త లాక్‌డవున్‌ల ఆవశ్యకత ఏర్పడవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. కరోనా కేసులు అధికంగా నమోదవుతున్న రాష్ట్రాల నుంచి వచ్చే సందర్శకులు ఇకపై 14 రోజులపాటు సొంత క్వారంటైన్ పాటించవలసి ఉంటుందని న్యూయార్క్, న్యూజెర్సీ, కనెక్టికట్ రాష్ట్ర గవర్నర్లు ప్రకటించారు. ఫ్లోరిడా, ఒక్లహామా, దక్షిణ కరోలినాలలో ఇటీవల కోవిడ్ కేసులు పెరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆందోళనకు లోనైన ఇన్వెస్టర్లు అమెరికా, యూరోపియన్ స్టాక్స్‌లో భారీ అమ్మకాలకు తెరతీశారు. భయాలు ఇలాగే కొనసాగితే మనదేశంలోనూ పరిస్థితి ఇంతకన్నా దారుణంగా ఉంటుందని ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు. ఆర్థిక మందగమనంపై దిద్దుబాటు చర్యలు తీసుకోవడం ఏ మేరకు సత్ఫలితాలు ఇస్తాయన్నది ముమ్ముందు తేలనుంది. గతేడాదిగా ఈ పరిస్థితి కొనసాగుతున్నా ముందే చర్యలు తీసుకుని ఉంటే కొంతయినా పరిస్థితి మెరుగు పడేది. గతంలోనే ఆర్‌బిఐ గవర్నర్‌గా ఉన్న రఘురామ్ రాజన్ అనేక హెచ్చరికలు చేసినా పట్టించుకోక పోవడం వల్ల ఈ దుస్థితి ఏర్పడిందనే చెప్పాలి. మరోవైపు డాలర్‌తో మారక విలువను ఆధీనంలోకి తెచ్చుకోక పోతే మరిన్ని కష్టాలు తప్పవు. అలాగే అనవసర దిగుమతులకు కల్లెం వేయాలి. చైనాతో ఉన్న విభేదాల కారణంగా అక్కడి దిగుమతులను తగ్గించు కుంటే మంచిది. లేకుంటే విదేశీఅ మారక నిల్వలపై తీవ్రప్రభావం చూపనుంది. దీంతో రూపాయి మరింత బలహీన పడనుంది. ఈ దశలో ఆర్థిక మందగమనానికి మందు వేసేందుకు ప్రభుత్వం గట్టిగానే ప్రయత్నాలు చేయాల్సి ఉంది. కరోనాతో రోడ్డున పడ్డ జనాలను ఆదుకునేందుకు ఉదారంగా ముందుకు రావాలి. ప్రజలు స్వయం సమృద్ధి సాధించేలా బ్యాంకులు ఉదారంగా రుణాలు అందచేయాలి. అంతే గాకుండా ప్రజలను ముక్కుపిండి వసూలు చేసే రుసుములను తగ్గించాలి. బ్యాంకింగ్ రంగంలో మొండి బకాయిలు పతాక

స్థాయికి చేరడం కూడా కారణంగా చెప్పుకోవాలి. ఎన్‌పిఏలు పెరుగుతున్న కొద్ది వృద్ధిరేటు క్షీణిస్తూ వస్తున్నదని గుర్తించాలి. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే పారిశ్రామిక రంగానికి రుణాలు ఏ మాత్రం అందుబాటులోకి రాకపోవడంతో మార్కెట్‌లో మాంద్యం ఏర్పడిందని అప్పట్లో విమర్శలు వచ్చాయి. అది జిడిపి వృద్ధిరేటు దిగజారడానికి దారి తీసిందని విశ్లేషించారు. చిన్న మధ్యతరహా పరిశ్రమలకైతే రుణ వితరణలో ప్రతికూల వృద్ధి నమోదయింది. దేశ చరిత్రలో పారిశ్రామిక రంగానికి వాణిజ్య రుణాలు భారీగా తగ్గడం కూడా ఇదే ప్రథమమని భావించారు. ఎన్‌డిఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ పెట్టుబడి వ్యయాలను గణనీయంగా పెంచడం ద్వారా ఆ లోటును పూడ్చింది. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు తగ్గుతున్న మనదేశంలో ధరలు పెంచడం అభివృద్ధిపై తీవ్ర ప్రభావం చూపనుంది. రూపాయి క్షీణత ఇలాగే కొనసాగితే దిగుమతులపై ఎక్కువగా ఆధారపడే మన దేశానికి ఆర్థిక ఇబ్బందులు తప్పేలా లేవు. వాణిజ్యలోటు, కరెంటు ఖాతా లోటు, ద్రవ్యోల్బణం పెరిగేందుకు రూపాయి పతనం పరోక్షంగా దోహదపడే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రూపాయి క్షీణతతో దిగుమతులు భారమవుతాయి. చమురు, పసిడి దిగుమతుల వ్యయాలు పెరిగితే, దేశ వాణిజ్య లోటు అధికమవుతుంది. దిగుమతుల కోసం విదేశీ మారకపు నిల్వలను అధికంగా ఖర్చు చేయాల్సి రావడంతో, కరెంటు ఖాతా లోటు కూడా పెరుగుతుంది. ఇప్పటికే మూతపడ్డ కారణంగా ప్రయాణాలు జరగడం లేదు. పర్యాటక, హోటల్ రంగాలు పూర్తిగా కుదేలయ్యాయి. మరోవైపు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల ఫలితంగా నిరుద్యోగం పెరుగుతున్నది. అలాగే ప్రైవేట్ పెట్టుబడులు తగ్గుతున్నవి. ప్రభుత్వ ఉద్యోగాల కోసం యువత ఎదురుచూడటం ఈ మధ్యకాలంలో ఎక్కువవుతున్నది. ఇలాంటి తక్షణ, అత్యవసర సమస్యల పరిష్కారంపట్ల దృష్టిసారించాల్సిన అధికార వర్గాలు నిర్లిప్తంగా ఉంటున్నాయి. ఈ దశలో దేశీయ ఆర్థిక విధానాలు అవలంబించాలి. గ్రామీణ ఆర్థిరంగాన్ని బలోపేతం చేసే దిశగా నిర్ణయాలు ఉండాలి.

## ఆర్‌బిఐ పరిధిలోకి సహకార బ్యాంకులు

### ముద్ర రుణగ్రహీతలకు 2శాతం వడ్డీ రాయితీ
### అంతర్జాతీయ విమానాశ్రయంగా కుషీనగర్ ఎయిర్ పోర్టు
### కేంద్ర కేబినేట్ నిర్నయాలు వెల్లడించిన జవదేకర్

న్యూఢిల్లీ,జూన్25(ఆర్ఎన్ఎ): అర్బన్, స్టేట్ మల్టీ సహకార బ్యాకులను రిజర్వ్ (ఆర్‌బీఐ) పరిధిలోకి తీసుకువచ్చినట్లు కేంద్ర మంత్రి ప్రకాశ్ జవదేకర్ తెలిపారు. 1,482 సహకార బ్యాంకులు, 58 మల్టీ స్టేట్ కోఆపరేటివ్ బ్యాంకులు ఆర్‌బీఐ పర్యవేక్షణ అధికారాల్లోకి వస్తాయని తెలిపారు. బుధవారం ప్రధాని మోడీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ నిర్ణయాలను కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన విలేకరుల సమావేశంలో జవదేకర్ వెల్లడించారు. 1,540 సహకార బ్యాంకులను ఆర్‌బీఐ పర్యవేక్షణలోకి తీసుకుని రావాలన్న నిర్ణయంతో 8.6 కోట్ల మంది డిపాజిటర్ల సొమ్ము రూ.4.84 లక్షల కోట్లకు భద్రత ఉంటుందన్నారు. ముద్రా యోజన కింద 2శాతం వడ్డీ రాయితీ పథకానికి, అలాగే ఉత్తరప్రదేశ్‌లోని కుషీనగర్ ఎయిర్ పోర్టును అంతర్జాతీయ విమానాశ్రయంగా ప్రకటించడానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిందని మంత్రి వివరించారు. కేంద్ర మంత్రివర్గ సమావేశం కూడా ఓబీసీ కులాల్లో ఉప వర్గీకరణ అంశాన్ని పరిశీలించేందుకు రాజ్యాంగం

లోని 340వ అధికరణం కింద ఏర్పాటు చేసిన కమిషన్ పదవీకాలాన్ని 6 నెలల పాటు అంటే జనవరి 31 వరకు పొడగిస్తూ కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఇకపోతే కేంద్ర ప్రభుత్వం ముద్ర లోన్లు తీసుకున్న వారికి శుభవార్త చెప్పింది. ఈ పథకంలో భాగంగా శిశు యోజన కింద రూ.50వేల కన్నా తక్కువ రుణం పొందిన వారికి వడ్డీపై 2 శాతం సబ్సిడీ ఇస్తున్నట్లు తెలిపింది. ఈ మేరకు ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర కేబినెట్ ఈ నిర్ణయానికి బుధవారం ఆమోదముద్ర వేసింది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి ప్రకాష్ జవదేకర్ మాట్లాడుతూ.. తాము అందిస్తున్న ఈ సబ్సిడీ వల్ల 9.37 కోట్ల మంది లబ్దిదారులకు మేలు కలుగుతుందన్నారు. ఇందుకు గాను కేంద్రం రూ.1540 కోట్లను ఖర్చు చేస్తుందని తెలిపారు. జూన్ 1, 2020 నుంచి మే 31, 2021 వరకు ఈ సబ్సిడీ అందిస్తామని తెలిపారు. కాగా దేశంలోని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా వ్యాపారులు, ఔత్సాహికులకు లబ్ది చేకూర్చడం కోసం మైక్రో యూనిట్స్ డెవలప్‌మెంట్ అండ్ ర్గీ÷నాన్స్ ఏజెన్సీ (ముద్ర) పథకాన్ని అప్పట్లో కేంద్రం ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా ఇప్పటికే 20 కోట్ల మంది లబ్ది పొందుతున్నారు. ఈ పథకంలో భాగంగా కేంద్రం సహకారంతో ఆర్థిక సంస్థలు లబ్దిదారులకు వ్యాపారం చేసుకునేందుకు రుణాలను ఇస్తాయి. రూ.50వేలు అంతకన్నా తక్కువ రుణం కావలిస్తే శిశు యోజన కింద ముద్ర పథకంలో భాగంగా రుణం ఇస్తారు. అదే రూ.50వేల పైన, రూ.5 లక్షల వరకు అయితే కిశోర్ యోజన కింద, రూ.5 లక్షల పైన, రూ.10 లక్షల లోపు అయితే తరుణ్ యోజన కింద రుణాలను ఇస్తారు.

## అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి

### - పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన ఎంపి బండి సంజయ్



వేములవాడ, జూన్ 25(నేటినిజం ప్రతినిధి) :పార్టీలకతీతంగా అభివృద్ధి కార్యక్రమాలలో ప్రజాప్రతినిధులు అందరూ భాగస్వాములు కావాలని బిజెపి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ పిలుపు ఇచ్చారు. ఈ సందర్భంగా వేములవాడ పట్టణంలోని 12వ వార్డు, 20 వార్డులో సిసి రోడ్లు, డ్రైనేజీ మరమ్మతుల శంకుస్థాపన కు విచ్చేసారు. కొబ్బరికాయ కొట్టి, హరితాహారం లో చెట్టు నాటారు..ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా అన్ని పార్టీల కౌన్సిలర్ లు అభివృద్ధి కార్యక్రమాలు జరపాలనీ కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కరోనా విషయంలో చేతులెత్తేసిన సంగతి గుర్తు చేశారు. ఎవరి ఆరోగ్యాన్ని వారే కాపాడుకోవాలనీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ప్రతాప రామకృష్ణ, మున్సిపల్ చైర్మన్ రామతీర్థం మాధవి, వైస్ చైర్మన్ మధు రాజేందర్, కౌన్సిలర్ లు రామతీర్థం కృష్ణవేణి, ముప్పిడి సునంద, పట్టణ అధ్యక్షులు రేగుల సంతోష్ బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్, బిజెపి పార్టీ జిల్లా నాయకులు కుమ్మరి శంకర్, ఎర్రం మహేష్, ముప్పిడి శ్రీనివాస్, బుర్ర శేఖర్, గోపు బాలరాజు, సెస్ డైరెక్టర్ రామతీర్థం రాజు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## ప్రజావేదిక కూల్చివేతతో ప్రజలకు దారేది

### ఒక్కరైనా జగన్ నివాసానికి వెళ్లగలిగారా
### వేదిక కూల్చి ఏడాదయిన సందర్భంగా టీడీపీ నేత పట్టాభిరాం

అమరావతి,జూన్25(ఆర్ఎన్ఎ): గతంలో ప్రజావేదిక ఉన్న సందర్భంగా.. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు ప్రతి రోజు వందలమంది ప్రజలు ప్రజా వేదిక వద్దకు వచ్చి తమ సమస్యలు చెప్పుకునేవారని, అర్జీలు ఇచ్చుకునేవారని టీడీపీ నేత పట్టాభిరాం అన్నారు. దానిని కూల్చి వ ఏయడంతో ప్రజలకు సిఎంను కలిసే అవకాశం లేకుండా పోయిందన్నారు. జగన్ ఫ్యూడల్ మనస్తత్వానికి కూల్చివేత ఓ నిదర్శనమని అన్నారు. ప్రజావేదిక కూల్చి గురువారం నాటికి ఏడాది అయిన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో జగన్మోహన్ రెడ్డి తాడేపల్లి ప్యాలెస్ గేట్లు సామాన్యుడికి ఏ రోజైనా తెరిచారా? అని ప్రశ్నించారు. ఒక్క సామాన్యుడైనా ఆ ప్యాలెస్‌లోకి వెళ్లగలిగాడా? అని అన్నారు. సీఎం ప్రజలను దూరం పెట్టి, ఇంటి చుట్టూ 144 సెక్షన్ పెట్టారని విమర్శించారు. సమస్యలు చెప్పుకునేందుకు వచ్చినవారిని ఆ ప్రాంతంలోకి రానివ్వకుండా చేశారని ఆరోపించారు. ఇదేనా పరిపాలన అని పట్టాభిరాం ప్రశ్నించారు. ప్రజలు కూడా ఆలోచించాలన్నారు. ఆ రోజున ప్రజలు తమ సమస్యలు చెప్పుకునేందుకు స్వతంత్య్రంగా వెళ్లి చంద్రబాబును కలిసేవారని.. ఇప్పుడు ఆ పరిస్థితి లేదని ట్టాభిరాం విమర్శించారు.

# యువశక్తి విచ్ఛిన్నాలు మాదకద్రవ్యాలు !

### (26 జూన్ అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణ వ్యతిరేక దినం సందర్భంగా)

ప్రపంచవ్యాప్తంగా మానవాళిలో, ముఖ్యంగా యువతీయువకులు అతి ప్రమాదకర మాదకద్రవ్యాలకు 5.6 శాతం బానికలుగా మారడమే కాకుండా వారి భవిష్యత్తును బుగ్గిపాలు చేసుకుంటున్నారు. అన్ని ముఖ్యనగరాలలో విచ్చిన్నవిడిగా మాదకద్రవ్యాలు అక్రమ రవాణాతో అందుబాటులో ఉండటంతో పాఠశాల బాలలు కూడా ఈ దుర్వసనాన బారిన పడడం పరిస్థితి తీవ్రతను గుర్తు చేస్తున్నది. అభివృద్ధి చెందిన దేశాలతో పాటు ఆర్థికంగా వెనుకబడి ఉన్న అన్ని దేశాలలో సులభంగా మాదకద్రవ్యాలు లభిస్తున్నాయి. ఒక్క అమెరికాలోనే 2007లో 322 మిలియన్ డాలర్ల విలువగల మాదకద్రవ్యాల అక్రమ వ్యాపారం జరిగిందని తేలింది. యువత భవితను కాలరాస్తున్న మాదకద్రవ్యాల దుర్వినియోగంతో పాటు అక్రమ రవాణను అరికట్టాలనే సంకల్పంతో ఐక్యరాజ్యసమితి సభ్యదేశాలు 26 జూన్ రోజున "అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణ వ్యతిరేక దినాన్ని'' నిర్వహించటానికి నిర్ణయించింది. 25 జూన్ 1839 రోజున చైనాలోని హూమెన్ నగరంలో 'లిన్ జెక్స్యూ' జరిపిన ఆపరేషన్‌లో పెద్ద ఎత్తున ఓపియం(నల్లమందు) అక్రమ వ్యాపార గుట్టు రట్టు చేయడం జరిగింది. జూన్ 17-16, 1987 రోజున వియన్నా నగరంలో 'అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణ సదస్సు'లో ఈ దినాన్ని పాటించాలని సిఫారసు చేయడం జరిగింది. దీనికి గుర్తుగా ఐరాస తీర్మానం ప్రకారం 26 జూన్ 1989 నుండి ఈ దినాన్ని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది.

అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణ వ్యతిరేక దినం-2020 నినాదంగా ''ఉత్తమ సంరక్షణ కోసం ఉత్తమ పరిజ్ఞానం(బెట్టర్ నాలెడ్జ్ ఫర్ బెట్టర్ కేర్)"గా నిర్ణయించడం జరిగింది. మానవాళి సంపూర్ణ ఆరోగ్య సాధనకు మాదకద్రవ్యాల దుర్వినియోగం విఘాతంగా నిలిచిందనే విషయాన్ని గమనించి, వాటి దుర్వినియోగంతో కలిగే దుష్పరిణామాలను వివరించే చర్యలు చేపట్టాలని సూచించారు. మాదకద్రవ్యాల దుర్వినియోగంతో అక్రమ రవాణ, వ్యవస్థీకృత నేరాలు, లంచగొండితనం, తీవ్రవాదులకు దగ్గరి సంబంధం ఉంటుంది. ఈ సంక్లిష్ట సమస్యను అరికట్టేందుకు వివిధ దేశాల మధ్య అంతర్జాతీయ సమన్వయం మరియు సహకారం తప్పనిసరి అని గుర్తించారు. మాదకద్రవ్యాల అక్రమ వ్యాపారంలో వాటి ఉత్పత్తి, ప్రాసెసింగ్, పంపిణి మరియు అమ్మకాలు వస్తాయి. మాదకద్రవ్యాలు నాలుగు రకాలుగా ఉంటాయి. వీటినే స్టిమ్యులెంట్స్( కొకైన్ లాంటివి), డిప్రసెంట్స్( ఆల్కహాల్ లాంటివి), పెయిన్ కిల్లర్స్(హెరాయిన్ లాంటివి) మరియు హాలూసినోజెన్స్(యల్‌యస్‌డి లాంటివి)గా వర్గీకరిస్తారు. ముఖ్యమైన మాదకద్రవ్యాలుగా మరిజువానా, ఓపినాయిడ్స్(హెరాయిన్, ఓపియం ఫార్మస్యూటికల్ ఓపినాయిడ్స్), కొకైన్, ఆల్కహాల్, వ్యాలియం, మార్ఫిన్, ఆంఫిటమైన్, పర్కొసెట్, కన్నాబిస్(భంగ్, గంజాయి/చరస్), ఏటియస్, సెడెటివ్, ఇన్హలెంట్స్, హేలూసినోజెన్స్ లాంటివి గుర్తించబడినవి. అమెరికాలో 53.2 మిలియన్ల మాదకద్రవ్య వినియోగదారులు ఉన్నారని, వీరిలో 43.5 మిలియన్ల వ్యసనపరులు మరిజువానా డ్రగ్‌నే వాడుతున్నారని తేలింది. దక్షిణ ఆఫ్రికాలో 10 శాతానికి పైగా ప్రజలు కన్నాబిస్ డ్రగ్ వాడుతున్నారు. మాదకద్రవ్యాలన్నింటిలో ఫెంటనైల్ అత్యంత తీవ్రతగల బలమైన డ్రగ్ అని తేలింది. మాదకద్రవ్యాల దుర్వినియోగంతో ఆర్థిక భావోద్వేగ నష్టంతో పాటు అధిక రోడ్డు ప్రమాదాలు జరుగే అవకాశం ఉంటుంది. ఈ దుర్వ్యసనంతో ఆరోగ్యం క్షీణించడం, జ్ఞాపకశక్తి తగ్గడం, మెదడు సమతుల్యత లోపం, తడబాటుతో నిర్ణయాలు తీసుకోవడం, బానిసలుగా సమాజంలో చులకన కావడం జరుగుతుంది. వీటి వాడకం పెరిగితే కుటుంబ సంబంధాలు విచ్ఛిన్నమై, అనారోగ్యంతో మరణించటం కూడా జరుగవచ్చు. మన భారతదేశంలో గత దశాబ్దకాలంగా మాదకద్రవ్యాల వినియోగం క్రమక్రమంగా పెరుగుతోంది. జాతీయ సర్వే వివరాల ప్రకారం, దేశ జనాభాలో 10-75 ఏళ్ల వయస్సుగల వారు 14.6 శాతం ఆల్కహాల్‌ను, 2.8 శాతం కన్నాబిస్ ఉత్పత్తులను, 2.06 శాతం ఓపినాయిడ్స్, 0.10 శాతం కొకైన్, 0.18 శాతం ఆంఫిటమిన్, 0.12 శాతం హాలూసినోజెన్స్ మరియు 1.08 శాతం సెడేటివ్‌లను వాడుతున్నారని తేలింది. దేశంలో 8.5 లక్షల వ్యసనపరులు ఇంజక్షన్ల రూపంలోమాదకద్రవ్యాలను తీసుకుంటున్నారు. మన దేశంలో డిల్లీ, పంజాబ్, హర్యానా, అస్సాం, మణిపూర్, మిజోరం, సిక్కిం, యుపిలలోనే సగానికి పైగా డ్రగ్స్ వినియోగం జరుగుతోంది. కాశ్మీర్ సరిహద్దుల నుండి ఉగ్రవాదులు అక్రమంగా మత్తు మందులను దేశంలోకి తెస్తున్నారు. కన్నాబిస్ డ్రగ్ వాడే వారు ప్రపంచవ్యాప్తంగా 3.9 శాతం ఉండగా, ఇండియాలో 1.2 శాతం ఉన్నారని అంచనా వేశారు. అదే విధంగా ఓపినాయిడ్స్ బానిసలుగా ప్రపంచవ్యాప్తంగా 0.70 శాతం ఉన్నారని, ఇండియాలో 2.06 శాతం వాడుతున్నారని తేలింది. ఆత్మహత్య చేసుకున్న వారిలో 47 శాతం ఆల్కహాల్ సేవించి ఉన్నారని నివేదికలు తెలుపుతున్నాయి.

ప్రపంచానికి పట్టిన మాదకద్రవ్యాల పీడను విరగడ చేయడానికి విస్తృత ప్రచారం, నివారణా మార్గాలు, పునరావాస(రిహబిలిటేషన్) ఏర్పాట్లతో పాటు ప్రజల్లో నెలకొన్న మూఢ నమ్మకాలను తొలగించే చర్యలు చేపట్టాలి. ఈ రోజున మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ వ్యాపార వ్యతిరేక ప్రచారాలు, ర్యాలీలు, గోడపత్రికలు, విద్యాలయాలలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తాయి. యువతీయువకులకు డ్రగ్ వినియోగ దుష్పరిణామాలను సవివరంగా తెలుపాలి. మాదకద్రవ్యాల అక్రమ వ్యాపారాన్ని అరికట్టుటకు చట్టబద్దంగా కఠిన చర్యలు తీసుకోవాలి. మత్తు పదార్థాల వాడకానికి స్వస్థి పలికేలా ప్రమాణాలు చేయించాలి. మాదకద్రవ్యాల లభ్యత లేకుండా చట్టాలను కట్టుదిట్టంగా అమలు చేయాలి. విద్యాలయాల పరిసరాలలో గస్తీలను పెంచి, మత్తు మందులు దొరకకుండా ప్రభుత్వాలు మరియు యాజమాన్యాలు, తల్లితండ్రులు చర్యలు తీసుకోవాలి. నేటి యువతే రేపటి బాధ్యతగల పెద్దలని తలచి, మత్తులో తూలుతూ జీవితాలను విచ్ఛిన్నం చేసుకోకుండా, సన్మార్గంలో ఎదిగేలా చూడాల్సిన కనీస కర్తవ్యం మనందరి మీద ఉంది. మందులు ఆరోగ్య సాధనకు మాత్రమేయని, అనారోగ్యానికి లేదా మరణానికి రహదారులు కావని నమ్ముదాం. మాదకద్రవ్యాల వినియోగానికి గట్టిగా 'నో' చెబుదాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# భావితరాలకు ఆరోగ్యవంతమైన పర్యావరణాన్ని కానుకగా ఇద్దాం



-హరితహారంలో పాల్గొన్న మంత్రి కొప్పుల

పెద్దపల్లి,జూన్25(ఆర్ఎన్ఎ): హరిహారంలో పత్రి ఒక్కరు ఉద్యమస్పూర్తితో పాల్గొనాలని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మొక్కల పెంపకం అందరి బాధ్యతని అన్నారు.

సీఎం కేసీఆర్ పిలుపు మేరకు ఆరో విడుత హరితహారంలో భాగంగా జిల్లాలోని ఎన్టీపీసీ మల్కాపూర్‌లో మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేత, రామగుండం ఎమ్మెల్యే చందర్ తొ కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడూ హరిహారంలో పత్రి ఒక్కరు ఉద్యమస్పూర్తితో పాల్గొనాలన్నారు. భవిష్యత్ తరాలకు ఆరోగ్యవంతమైన పర్యావరణాన్ని అందించాల్సిన బాధ్యత మనందరి పై ఉందన్నారు.

సీఎం కేసీఆర్ సూచించిన విధంగా మొక్కలు నాటి వాటిని సంరిక్షించాలన్నారు. అప్పుడే ఆకుపచ్చ తెలంగాణను సాధించుకోగలమన్నారు. భవిష్యత్ తరలాకు మంచి వాతావరణం ఇచ్చే బాధ్యత మనదేనని అన్నారు.

## హరిత లక్ష్యాన్ని పూర్తి చేద్దాం

### -మొక్కలు నాటిన మంత్రి పువ్వాడ

ఖమ్మం,జూన్25(ఆర్ఎన్ఎ): ఆరో విడత తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో లక్ష్యాన్ని పూర్తి చేయాలని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా ఖమ్మంలోని లకారం మినీ ట్యాంక్ బండ్ పై వెయ్యి మొక్కలు, వెలుగుమట్ల అర్బన్ ఫారెస్ట్ రేంజ్ పార్కులో 117 ఎకరాల్లో 57,700 మొక్కలను నాటే కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ హరితహారం కార్యక్రమంలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. సీఎం కేసీఆర్ అద్భుత ఆలోచనలోంచి పుట్టిందే ఈ హరితహారం కార్యక్రమం అన్నారు. గత ఐదు విడతలకు భిన్నంగా ఈసారి ఆరో విడత తెలంగాణకు హరితహారాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. నాటిన ప్రతి మొక్క బతికేలా చర్యలు తీసుకుంటున్నామని, అందుకు అధికారులకు ఇప్పటికే సూచించడమైందన్నారు. పర్యావరణానికి, జీవ వైవిధ్యానికి, వాతావరణ సమతౌల్యానికి హరితహారం దోహదపడుతుందని, అందుకే ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని మంత్రి కోరారు.

## ముంబై ఐఐటి కీలక నిర్ణయం

### ఏడాదంతా ఆన్‌లైన్ క్లాస్‌లకే ప్రాధాన్యం
### కరోనా దెబ్బతో మూతపడ్డ గ్లోబల్ స్కూల్

ముంబై,జూన్25(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో కరోనా వైరస్ విజృంభిస్తున్న నేపథ్యంలో ఐఐటీ ముంబై కీలక నిర్ణయం తీసుకుంది. ఈ విద్యా సంవత్సరం మొత్తం ముఖాముఖి క్లాసులను రద్దు చేసింది. ఇకపై ఆన్‌లైన్ ద్వారానే క్లాసులు నిర్వహించాలని నిశ్చయించుకుంది. విద్యార్థుల ఆరోగ్యమే అత్యంత ముఖ్యమని భావించిన ఐఐటీ ముంబై ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఆన్‌లైన్ ద్వారా క్లాసులు వినేందుకు పేద విద్యార్థులకు అవసరమైన ఆర్థిక సహాయం చేయాలని దాతలను కోరింది. మహమ్మారి కరోనా దెబ్బతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం అవుతోంది. అగ్రరాజ్యాలను సైతం కోవిడ్-19 తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. అటు గల్ఫ్‌లో కూడా ఈ వైరస్ తీవ్రత అధికంగానే ఉంది. ప్రధానంగా యూఏఈ, సౌదీ అరేబియా, కువైట్, ఖతార్‌లో కరోనా కల్లోలం సృష్టిస్తోంది. దీంతో ఆయా దేశాల్లో తీవ్ర సంక్షోభం నెలకొంది. దీని ప్రభావం ఆర్థిక వ్యవస్థపై పడడంతో ఉపాధి, ఉద్యోగాలు కోల్పోతున్నవారు కోకోల్లలు. ఈ ఆర్థిక భారం విద్యా సంస్థలను విడిచిపెట్టలేదు. ప్రస్తుత ఆర్థిక సంక్షోభం వేళ స్కూల్ టీచర్లకు, సిబ్బందికి జీతాలు చెల్లించలేక, నిర్వాహణ కష్టంగా మారడంతో యాజమాన్యాలు శాశ్వతంగా పాఠశాలలను క్లోజ్ చేస్తున్నాయి. ఇలాగే దుబాయిలోని ఓ ఇండియన్ స్కూల్ పూర్తిగా మూతపడబోతోంది. నాలుగేళ్ల క్రితం దుబాయిలో ఓపెన్ అయిన జెమ్స్(జీఈఎంఎస్) హెరిటేజ్ ఇండియన్ స్కూల్ కరోనా సంక్షోభం నేపథ్యంలో శాశ్వతంగా

మూత వేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు స్కూల్‌లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు యాజమాన్యం సందేశాలు పంపించింది. కాగా, విద్యార్థులను తమ వేరే బ్రాంచీల్లో తీసుకుంటామని జెమ్స్(జీఈఎంఎస్) గ్లోబల్ చీఫ్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ క్రిస్టోఫర్ స్టోన్ తెలిపారు. 2021, మార్చిలో ఈ పాఠశాలను శాశ్వతంగా మూసివేస్తున్నట్లు ఆయన తన ప్రకటనలో పేర్కొన్నారు.

## అంతరిక్ష కార్యకాలపాల్లో ప్రైవేట్ భాగస్వామ్యం

### పరిశోధనలకు మరింత ఊపునిస్తుంది
### భారత అంతరిక్ష పరిశోధనా కేంద్రం చీఫ్ కే శివన్

బెంగళూరు,జూన్25(ఆర్ఎన్ఎ): భారత అంతరిక్ష కార్యకలాపాల్లో ప్రైవేటు రంగ సంస్థలు కూడా పాల్గొనేందుకు కేబినెట్ ఆమోద ముద్ర వేయడాన్ని ఇస్రో స్వాగతించింది. ఇది పరిశోధనలకు మరింత ఊపునిస్తుందని అభిప్రాయపడింది. దీనిపై భారత అంతరిక్ష పరిశోధనా కేంద్రం చీఫ్ కే శివన్ స్పందించారు. అంతరిక్ష రంగంలోకి ప్రైవేటు సంస్థలను ఆహ్వానించడం వల్ల.. యావత్ దేశం స్పేస్ టెక్నాలజీ లాభాలను పొందుతుందని శివన్ తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రైవేటు భాగస్వామ్యుల రాకతో అంతరిక్ష రంగం వృద్ధి వేగమవుతుందని, అంతర్జాతీయ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థలో భారత పరిశ్రమ కీలకంగా మారుతుందని శివన్ అభిప్రాయపడ్డారు. అంతరిక్ష రంగంలో ప్రైవేటు వారికి అవకాశం ఇవ్వడం వల్ల టెక్నాలజీ రంగంలో ఉద్యోగ అవకాశాల కల్పన భారీ స్థాయిలో పెరుగుతుందని శివన్ తెలిపారు. దాంతో భారత్.. గ్లోబల్ టెక్నాలజీలో బలమైన శక్తిగా ఎదుగుతుందన్నారు. దీర్ఘకాలికమైన సామాజిక ఆర్థిక సంస్కరణలు, అంతరిక్ష సంస్కరణలు చేపట్టడం వల్ల.. భారత్ అభివృద్ధిలో రోదసి ఆధారిత సేవలు మెరుగవుతాయని శివన్ చెప్పారు. ఈ సంస్కరణలతో అంతరిక్ష కార్యకలాపాల్లో.. భారత్ సమర్థవంతమైన దేశంగా మారుతుందని ఇస్రో చీఫ్ అభిప్రాయపడ్డారు. దీని కోసం కేంద్ర ప్రభుత్వం అటానమస్ నోడల్ ఏజెన్సీని ఆమోదించిందని, ఇండియన్ నేషనల్ స్పేస్, ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్ పేరుతో కార్యక్రమాలు చేపడుతారని శివన్ తెలిపారు. అంతరిక్ష రంగంలో పెట్టుబడులు పెట్టేవారికి అనుమతులు ఇవ్వడం లాంటి నిర్ణయాలు ఆ ఏజెన్సీ చూసుకుంటుందన్నారు. అంతరిక్ష రంగంలో ప్రైవేటు కంపెనీల కార్యకలాపాలపైన కూడా ఆ ఏజెన్సీ నిఘా పెడుతుందన్నారు. అంతరిక్ష రంగంలో పెట్టుబడులు పెట్టే ప్రైవేటు కంపెనీలకు ఇస్రో తన సాంకేతిక నిపుణతను అందజేస్తుందని శివన్ చెప్పారు.

## హరిత తెలంగాణ లక్ష్యంగా మొక్కలు నాటాలి : ఎమ్మెల్సీ పోచంపల్లి

హైదరాబాద్, జూన్ 25: హరిత తెలంగాణ లక్ష్యంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆరో విడత హరితహారం కార్యక్రమంలో భాగంగా నేడు హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ పోచంపల్లి పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణకు హరితహారం కార్యక్రమం ఒక మహాయజ్ఞంలా జరగాలన్నారు. ఇందుకులో భాగంగా ప్రతి ఒక్కరూ మూడు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. భావితరాలకు హరిత తెలంగాణను బహుమతిగా ఇవ్వడమే ఈ కార్యక్రమం ముఖ్య లక్ష్యమన్నారు.నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని అప్పుడే హరిత తెలంగాణ కల సాధ్యమౌతదన్నారు. మొక్కలు నాటడం వల్ల పర్యావరణానికి, జీవ వైవిధ్యానికి, వాతావరణ సమతుల్యతకు ఎంతో దోహద పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ వై.సతీష్ రెడ్డి, జడ్పీటీసీ గుడి వంశీధర్ రెడ్డి, టీఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకులు తూము హరీష్ పటేల్, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కో ఆర్డినేటర్ రాఘవ, టీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కిషోర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక దందాకు కళ్లెం వేయని అధికారులు

### యధేచ్ఛగా ట్రాక్టర్లలో తరలింపు

### జరిమానాలకు భయపడని అక్రమార్కులు

ఆదిలాబాద్,జూన్25(ఆర్ఎన్ఎ): ఇసుక రవాణాను అధికారులు చూసిచూడనట్లుగా వ్యవహరించడంతో అక్రమ వ్యాపారులు జోరుగా ఇసుక తరలిస్తూ నిల్వ చేసుకుంటున్నారు. ఇసుకకు ప్రస్తుతం డిమాండ్ పెరగడంతో వ్యాపారులకు కాసులు కురిపిస్తున్నాయి. గ్రామాలలోని ప్రతి ఒక్కరూ ట్రాక్టర్‌ను కొనుగోలు చేసి ఇసుక దందాను ఎంచుకుంటున్నారు. ఎటువంటి డబ్బులు చెల్లించకుండా ఇసుకను తోడుకుని అమ్ముకోవడంతో వ్యాపారులకు కాసుల వర్షం కురుస్తుంది. గ్రామాలలో స్థానికంగా ఉన్న చిన్నచిన్న అవసరాల మేరకు ఇసుకను వాడుకునేందుకు ఇచ్చిన అవకాశాన్ని దుర్వినియోగం చేస్తూ కాంట్రాక్టర్‌లకు, ఇతర అవసరాలకు ఇసుకను రవాణా చేస్తూ కాసులు సంపాదించుకుంటున్నారు. వర్షాకాలంలో అవసరాలు ఉ ండడంతో గ్రామాల్లో రహస్యంగా దాచి పెడుతున్నారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలి. సంబంధిత అధికారుల పర్యవేక్షణ కోరవడడంతో ఇసుకు పెన్‌గంగా నది నుంచి యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఇసుక తరలిస్తూ ట్రాక్టర్‌లు పట్టుబడితే నామమాత్రంగా జరిమానా విధిస్తూ చూసిచూడనట్లు వ్యవహరించడంతో ఇసుక వ్యాపారులు తమ పంథాను మార్చుకోకుండా ఇసుకను తరలిస్తున్నారు. పెన్‌గంగా నదితీరం నుంచి గంగాపై భాగంలో ఇసుకను రవాణా చేసే వ్యాపారులు ఇసుక డంప్పులను ఏర్పాటు చేసి ఇసుకను నిల్వ చేసుకుంటున్నారు. పెన్‌గంగా నది నుంచి నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్‌లలో ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులు ఇసుక కొరతను సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. వర్షాకాలం పెన్‌గంగా నదిలోకి వరదనీరు చేరితే ఇసుక తీసే అవకాశం ఉండదు.. ప్రస్తుతం గంగలో నుంచి కూలీల ద్వారా ఇసుకను తీసుకువచ్చి గంగనది తీరంలో మైదాన ప్రాంతంలో డంప్పులను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ఇసుక వ్యాపారం జోరుగా సాగుతోంది. ఇసుకను అక్రమంగా తరలిస్తూ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు ఆ వైపుగా చూడకపోవడంతో అక్రమార్కులు యథేచ్ఛగా ఇసుకను తరలిస్తున్నారు. వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ పెన్‌గంగాను తోడేయం మానడం లేదు. రోజుకు 50 ట్రాక్టర్ ట్రిప్పులను తరలిస్తున్నా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. పెన్‌గంగా నదిలో నుంచి నిత్యం పదుల సంఖ్యల్లో ట్రాక్టర్‌లలో ఇసుకను తరలిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో ఇష్టానుసారంగా ఇసుకను తోడేస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంతో పాటు వివిధ మండలాలోని వివిధ గ్రామాలకు ట్రాక్టర్‌లలో పరిమితికి మించి ఇసుకను తరలిస్తున్నారు. ప్రస్తుతం వరదనీరు గంగలోకి రావడంతో ఇసుక తీసే వీలులేక పోవడంతో ఉన్న ఇసుకను తరలిస్తున్నారు. భారీ రేటు కూడా పలుకడంతో ట్రాక్టర్‌ల యాజమానులు, వ్యాపారులు పెన్‌గంగ నది నుంచి ఇసుకను యథేచ్ఛగా తరలిస్తున్నారు. రోజుకు ట్రాక్టర్ ద్వారా ఒక్కొ ట్రాక్టర్ ద్వారా రెండు ట్రిప్పుల ఇసుకను తరలిస్తున్నారు. పెన్‌గంగ నుంచి ఇసుకను నిబంధనలకు విరుద్ధంగా రవాణా చేస్తే కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నా ఫలితం కానరావడం లేదు.

# ప్రపంచ ఆర్థిక వ్యవస్థ బలహీనం

### –బంగారం ధరల పెరుగుదలపై ప్రభావం

న్యూఢిల్లీ,జూన్25(ఆర్ఎన్ఎ): కరోనా నేపథ్యంలో అగ్రరాజ్యం అమెరికాతో పాటు ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థ బలహీనపడుతుండటంతో పెట్టుబడిదారుల్లో ఆందోళన నెలకొంటున్నది. గ్లోబల్ మార్కెట్లో బంగారం ధర గరిష్ఠ స్థాయికి చేరుకోవడం కూడా దేశీయంగా ధరలు పెరుగడానికి ప్రధాన కారణమని విశ్లేషిస్తున్నారు. దీనిఇకతోడు బంగారం దిగుమతలు కూడా ఆగిపోయాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి మరింత క్షీణించడం ధరలు పుంజుకోవడానికి దోహదపడుతున్నాయి. దీంతోబంగారం భగభగ మండుతున్నది. రోజుకొక రికార్డు స్థాయికి చేరుకుంటున్న అతి విలువైన లోహాలు మరో శిఖరానికి చేరువయ్యాయి. ప్రాంతీయ ఆభరణాల వర్తకుల నుంచి వచ్చిన కొనుగోళ్ల డిమాండ్, మరోవైపు అంతర్జాతీయ దేశాల ఆర్థిక మందగమన పరిస్థితుల్లో పెట్టుబడిదారులు తమ ఇన్వెస్ట్‌మెంట్లను సురక్షితమైన పసిడివైపు మళ్లించడంతో దేశవ్యాప్తంగా పుత్తడి రూ.50 వేల మార్కును దాటింది. బంగారంతోపాటు వెండి భారీగా పుంజుకున్నది. మార్కె ట్లో అతి విలువైన లోహాల ధరలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. ప్రాంతీయ ఆభరణాల వర్తకులు కొనుగోళ్లకు మొగ్గుచూపడం, పెట్టుబడిదారుల తమ ఇన్వెస్ట్ మెంట్లను సురక్షితమైన బంగారం వైపు మళ్లించడంతో నూతన శిఖరాలకు చేరుకున్నాయని తెలిపారు.

# మంజీర ఆయకట్టు రైతుల్లో ఆందోళన

### –వర్షాలు లేక వెలవెలబోతున్న ప్రాజెక్ట్

మెదక్,జూన్25(నేటినిజం ప్రతినిధి): మంజీర నది జలజలా పారుతుందని ఆశపడ్డ రైతులకు నిరాశే మిగిలింది. ఖరీఫ్‌లో వేసిన పంటలకు తాత్కాలిక ఊరట లభిస్తున్నా, భవిష్యత్తు నీటి అవసరాల విషయంలో రైతులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రాబోయే రోజుల్లో అయినా గట్టి వర్షాలు కురవకుంటే తాగు, సాగు నీటికి తీవ్ర ఇబ్బందులు తప్పేలా లేవు. ఇప్పటికిప్పుడే ప్రమాద ఘంటికలు లేకున్నా, ఖరీఫ్ చివరి దశలో, రబీలో పంటల సాగుకు ఇబ్బందులు తప్పవని అధికారులు చెబుతున్నారు. ఇప్పటి నుంచే మంచినీటి కొరతతో రోజువిడిచి రోజు పద్ధతి, మరికొన్ని గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే మరికొన్ని నెలల్లో మంచినీటి కొరత తీవ్రమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వం పత్యామ్నాయ చర్యలు చేపట్టి రైతులకు సాగు, తాగునీటిని అందించాలని వేడుకుంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పుడిప్పుడే వర్షాలు కురుస్తున్నాయి. మంజీరా నది మాత్రం నీరు లేక బోసిపోతోంది. నది గర్భం ఎడారిని తలపిస్తోంది. పరీవాహక ప్రాంతంలోని బోర్లన్నీ వట్టిపోయాయి. లక్షల వ్యయంతో నిర్మించిన ఎత్తిపోతల పథకాలు ఉత్తగానే ఉన్నాయి. వందలాది ఎకరాల సాగు భూమి బీడుగా మారింది. వ్యవసాయమే జీవనాధారమైన రైతుల ఆశలు అడియాశలయ్యాయి. దీంతో పరీవాహక ప్రాంత రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. కొంతమంది రైతులు ఆశతో పత్తి పంటను సాగు చేసినా ఎదుగదల తగ్గి పెట్టుబడి అధికమవుతుందని రైతులు వాపోతున్నారు. వర్షాలు సరిగా కురవకపోవడంతో సింగూరు వెలవెలబోయింది. మంజీరలో చుక్క నీరులేక ఇసుకదిబ్బలు తేలాయి.

# తిరుమల ఒక్కరోజు ఆదాయం 62లక్షలు

### –భక్తుల రాకపై ఆంక్షలతో తగ్గిన ఆదాయం

తిరుమల,జూన్25(ఆర్ఎన్ఎ): కరోనాకు ముందు తిరుమల శ్రీవారా ఆదాయం కనీసం రెండు కోట్లుగా ఉండేది. నిత్యం భక్తులతో కిటకిటలాడే స్వామి వారి ఆలయం ఇప్పుడు బోసిపోయింది. పరిమిత సంఖ్యలో భక్తులను అనుమతిస్తున్నారు.

రోజుకు కనసీం 7వేల వరకుమాత్రమే భక్తులు రాగలుగుతున్నారు. దీంతో ఆదాయం కూడా భారీగా పడిపోయింది. తిరుమల, తిరుపతి దేవస్థానం ఆలయానికి బుధవారం ఒక్కరోజే సుమారు రూ. 62 లక్షల హుండీ ఆదాయం వచ్చిందని ఆలయ అధికారులు తెలిపారు. గడిచిన 24 గంటల్లో 9059మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారని వెల్లడించారు. ఈరోజు 6వేల మంది భక్తులకు ప్రత్యేకదర్శనం ద్వారా దర్శన అవకాశం కలుగనుందని పేర్కొన్నారు. 3750 ఉచిత టైమ్‌స్లాట్ టోకెన్లు జారీచేసినట్లు తెలిపారు. కరోనా మహమ్మారిని అరికట్టేందుకు భక్తులు కోవిడ్ నిబంధనలు పాటిస్తూ ఆలయానికి రావాలని సూచించారు. ప్రతి రోజూ 10వేల మంది భక్తులకు మాత్రమే దర్శన అవకాశముందని తెలిపారు. ఆన్‌లైన్‌లో టిక్కెట్లు నమోదు చేసుకున్న వారికి మాత్రమే ఆలయంలో ప్రవేశం ఉంటుందని టీటీడీ అధికారులు వివరించారు.

# భవన నిర్మాణ కార్మికులను ఆదుకోండి

### –సిఎం జగన్‌కు నారా లోకేశ్ లేఖ

అమరావతి,జూన్25(ఆర్ఎన్ఎ): భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సిఎం జగన్‌ను టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కోరారు. ఈ మేరకు ఏపీ సీఎం జగన్‌కు లేఖ రాశారు. అలాగే సంక్షేమ మండలి బోర్డు, గతంలో మాదిరి కార్మిక సంక్షేమ పథకాల అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారినప్పటి నుండి భవన నిర్మాణ కార్మికులకు వెతలు మొదలయ్యా యన్నారు. రాష్ట్రంలో ఇసుక మాఫియా ఏ స్థాయిలో పేట్రేగిపోతోందో తాజాగా ఓ మంత్రికి ఇసుకకు బదులు మట్టి పంపించిన ఘటనే నిదర్శనమని లోకేష్ పేర్కొన్నారు. ఇదంతా స్టాక్ యార్డు ముసుగులో జరుగుతున్న దోపిడీ అని అధికారులు, వైసీపీ నేతలే ఇందులో సూత్రధారులన్నది సుస్పష్టమని విమర్శించారు.

# కాంగ్రెస్‌ది నేటికీ ఎమర్జెన్సీ మనస్తత్వమే

### రాత్రికి రాత్రే దేశాన్ని జైలుగా మార్చిన ఇందిర

### ఎమర్జెన్సీకి 45 ఏళ్లు పూర్తయిన సందర్భంగా అమిత్ షా విమర్శలు

న్యూఢిల్లీ,జూన్25(ఆర్ఎన్ఎ): కాంగ్రెస్ ఇప్పటికీ ఎమర్జెన్సీ రోజుల తరహా మనస్తత్వానే కలిగి ఉందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా దుయ్యబట్టారు. విపక్ష పార్టీగా కాంగ్రెస్ పార్టీ తనకు తాను కొన్ని ప్రశ్నలు వేసు కోవాలని అన్నారు. ఎమర్జెన్సీ తరహా మనస్తత్వం ఇంకా పార్టీలో ఎందుకు కొనసాగుతోందని, పార్టీలో ఇతర నేతలను ఎందుకు మాట్లాడనివ్వడం లేదని ప్రశ్నించుకోవాలని హితవు పలికారు. ఇందిరాగాంధీ ప్రభుత్వం ఎమర్జెన్సీ విధించి ఈరోజుతో 45 సంవత్సరాలు పూర్తయిన క్రమంలో కాంగ్రెస్ పార్టీపై అమిత్ షా విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ ప్రతినిధి సంజయ్ ఝా తొలగింపు వంటి ఘటనలు దీనికి సంకేతమని అన్నారు. సీడబ్ల్యూసీ సమావేశంలో సీనియర్ సభ్యులు, యువ సభ్యులు కొన్ని అంశాలు లేవనెత్తగా వారి గొంతు నొక్కారని, పార్టీ ప్రతినిధి ఒకరిపై అనవసరంగా వేటువేశారని కాంగ్రెస్ పార్టీలో నేతలు ఇమడలేక పోతున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీలో నేతలు ఎందుకు ఇమడలేకపోతున్నారనేది తెలుసుకోవాలని సూచించారు. 45 ఏళ్ల కిందట దేశం ఇదే రోజున అంటే జూన్ 25న ఓ కుటుంబం అధికార దాహంతో రెండేళ్ల పాటు దేశం ఎమర్జెన్సీలోకి వెళ్లిందని రాత్రికి రాత్రే దేశం జైలుగా మారిందని పేదలు, అణగారిన వర్గాల వారిపై వేధింపులు సాగాయని అమిత్ షా గుర్తు చేశారు. లక్షలాది ప్రజల ఆందోళనలతోఎమర్జెన్సీని ఎత్తివేయడంతో భారత్‌లో ప్రజాస్వామ్య పునరుద్ధరణ జరిగిందని అన్నారు. కాంగ్రెస్‌లో మాత్రం ప్రజాస్వామ్యం లోపించిందని విమర్శించారు. పార్టీ, దేశ ప్రయోజనాల కంటే ఓ కుటుంబ ప్రయోజనాలే అధికమయ్యాయని ఇప్పటికీ కాంగ్రెస్‌లో పరిస్థితి అలాగే ఉండటం బాధాకరమని అమిత్ షా వ్యాఖ్యా నించారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ.. 1975లో దేశంలో ఎమ్జ్జ్గ÷న్సీ విధించిన విషయం తెలిసిందే. ఆ ఎమర్జెన్సీకి నేటితో 45 ఏళు నిండాయి. ఈ నేపథ్యంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా.. ఆ నాటి కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ఖండించారు. ట్విట్టర్ ద్వారా స్పందించిన షా.. మీడియాను, న్యాయవ్యవస్థను, భావస్వేచ్ఛను నాశనం చేసినట్లు విమర్శించారు. పేద, బలహీనవర్గాల వారిపై అకృత్యాలు జరిగినట్లు తెలిపారు. లక్షలాది మంది ప్రజల ప్రయత్నాల వల్ల ఎమర్జెన్సీని ఎత్తివేశారని షా అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని మళ్లీ నిలిపారని, కానీ అది కాంగ్రెస్ పార్టీలో మాత్రం లోపించింద న్నారు. జాతి ప్రయోజనాలు, పార్టీ ప్రయోజనాలు పక్కన పెట్టి ఒక్క కుటుంబమే రాజ్యమేలిందన్నారు. ఇప్పటికి కూడా ఆ పార్టీలో ఇదే తరహా వ్యవహారాలు నడుస్తున్నట్లు షా ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీలో ఎమర్జెన్సీ మైండ్‌సెట్ అలాగే ఉండిపోయిందని, దానిపై ఆ పార్టీ ఆత్మావలోకనం చేసుకోవాలన్నారు.




హరితహారంలో భాగంగా సూర్యాపేటలో మొక్కలు నాటిన మంత్రి జగదీశ్వర్ రెడ్డి

# పచ్చని తెలంగాణను నిర్మిద్దాం

### మొక్కలు నాటి కెసిఆర్ ఆకాంక్షను నెరవేరుద్దాం

### –మంత్రి జగదీశ్వర్ రెడ్డి పిలుపు

సూర్యాపేట,జూన్25(ఆర్ఎన్ఎ): మొక్కల పెంపకం ప్రాధాన్యతను గుర్తించి రాష్ట్రాన్ని హరితమయంగా చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశయానికి అనుగుణంగా సాగాలని విద్యుత్ శాఖామంత్రి జగదీష్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ ఒక్కో మొక్క నాటినా లక్ష్యాన్ని చేరుకుంటామని, పచ్చని తెలంగాణను నిర్మించుకుంటామని అన్నారు. అందులో భాగంగానే హరితహారం పేరుతో గడిచిన ఆరు ఏండ్లుగా చైతన్యం తీసుకొచ్చి మొక్కల పెంపకంలో పోటీపడేలా చేసిన ఘనత ముమ్మాటికి ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనన్నారు. ఆరోవిడత హరితహారం కార్యక్రమంలో బాగంగా గురువారం ఉదయం ఆయన సూర్యపేట పురపాలక సంఘం పరిధిలోని 9 వ వార్డులో ఏకకాలంలో 1050 మొక్క లు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పర్యావరణ సమస్య ప్రపంచానికి సవాల్ విసురుతున్న నేపథ్యంలో అడవుల పెంపకంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించి సత్ఫాలితాలు సాదించిందన్నారు. పర్యావరణ సమస్యను అధిగమించాలి అన్నదే ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పం అని అందుకు అనుగుణంగా టార్గెట్లు పెట్టుకుని మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉద్యమంలా కొనసాగిస్తున్నట్లు ఆయన చెప్పుకొచ్చారు. మొక్కలే మనకు రక్ష అని, మనమంతా ఇందులో పాల్గొనాలని అన్నారు.

# ప్రజావేదిక కూల్చి ఏడాది పూర్తి

### అక్కడ శిథితాలు పరిశీలించేందుకు టిడిపి యత్నం

### బాబు ఇంటికి వెళ్లకుండా టిడిపి నేతలపై ఆంక్షలు

### పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత

### అచ్చెన్నను హతమార్చేందుకు కుట్ర అంటూ టిడిపి ఆరోపణ

అమరావతి,జూన్25(ఆర్ఎన్ఎ): కృష్ణాకరకట్ట దగ్గర టీడీపీ నేతలను పోలీసులు అడ్డుకున్నారు. ప్రజావేదిక కూల్చి గురువారంనాటికి ఏడాది అయిన సందర్భంగా ప్రజావేదిక శిథిలాల వద్దకు టీడీపీ నేతలు చేరుకున్నారు. ఇక్కడ ఎలాంటి నిరసనలకు అనుమతి లేదని పోలీసులు తెలిపారు. ఆదేశాలను ధిక్కరిస్తే అరెస్టు చేస్తామన్నారు. ఈ నేపథ్యంలో టీడీపీ నేతలు, పోలీసుల మధ్య వాగ్వాదం జరగడంతో టీడీపీ నేతలు నక్కా ఆనందబాబు, దేవినేని ఉమా, వర్ల రామయ్య, ఆలపాటి రాజా, కొల్లు రవీంద్ర తదితరులను అరెస్ట చేసి వ్యాన్ ఎక్కించారు. టీడీపీ అధినేత చంద్రబాబు నివాసానికి వెళుతున్న తెలుగుదేశం నేతలను కూడా పోలీసులు నిలిపివేశారు. చంద్రబాబు నివాసం పక్కనే ఉన్న ప్రజావేదిక కూల్చివేసి సంవత్సరం అవుతున్న సందర్భంగా టీడీపీ నేతలు బయల్దేరారు. గుంటూరు, కృష్ణా జిల్లాలకు చెందిన పలువురు నేతలను చంద్రబాబు నివాసం సమీపంలో పోలీసులు నిలిపివేశారు. ఆదేశాలను ధిక్కరించి వస్తే అరెస్టు చేస్తామని హెచ్చరించారు. కృష్ణవేణి మోడల్ వద్ద కొల్లు రవీంద్ర, తెనాలి శ్రవణ్ కుమార్‌ను పోలీసులు నిలిపివేశారు. పోలీసులతో టీడీపీ నేతలు వాగ్వాదానికి దిగారు. చంద్రబాబు ఇంటికి వెళ్లే మార్గాల్లో, ఆయన నివాసం వద్ద పోలీసులు భారీగా మోహరించారు. ఈ సందర్భంగా దేవినేని ఉమా మాట్లాడుతూ ఆస్పత్రిలో ఉన్న అచ్చెన్నాయుడును అరెస్టు చేశారని, అచ్చెన్నను హతమార్చాలని దుర్మార్గమైన పథకం వేశారని ఆరోపించారు. సజ్జల రామకృష్ణారెడ్డి డైరక్షన్‌లో బడుగు బలహీన వర్గాల్లో పార్టీ నాయకుడుగా, పొలిట్‌బ్యూరో సభ్యుడిగా ఉన్న అచ్చెన్నను అరెస్టు చేసి రాత్రి కస్టడీలోనే చంపాలని ప్రయత్నం చేశారని ఆరోపించారు. అలాగే చంద్రబాబు ఇంటికి వెళ్లే మార్గంలో పోలీసులు మోహరించారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తతగా మారింది. పోలీస్ వ్యవస్థను కేవలం టిడిపిని, నేతలను వేధించడానికే వైకాపా ప్రభుత్వం పనిచేస్తోందని మాజీమంత్రి నక్కా ఆనంద బాబు మండిపడ్డారు. ఏపీ పోలీసులపై తమకు నమ్మకం లేదని ప్రతిపక్షంలో ఉండగా చెప్పిన వ్యక్తి జగన్ అని నక్కా ఆనంద బాబు గుర్తు చేశారు. ఇప్పుడు మాత్రం పోలీసులను అడ్డు పెట్టుకొని టీడీపీ నేతలపై కక్ష్య సాధింపులకు పాల్పడుతున్నారని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వంలో వ్యవస్థలన్నీ టీడీపీ శ్రేణులను వేధించటానికి ఉపయోగిస్తున్నారన్నారు. దేశంలో కొత్త సంస్కృతిని ఈ ప్రభుత్వం మొదలు పెట్టిందని ఆనందబాబు విమర్శించారు. సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడితే అరెస్టులు చేస్తున్నారన్నారు. రాష్ట్ర డీజీపీ మూడుసార్లు హైకోర్టుకు హాజరు కావటం.. పోలీసుల వైఖరి ఎలా ఉందో తేటతెల్లం చేస్తోందన్నారు. అచ్చెన్నాయుడిని రాత్రికి రాత్రి డిశ్చార్జ్ చేయాల్సిన అవసరం ఏంటని ప్రశ్నించారు. అసలు డాక్టర్ కాకుండా వేరే డాక్టర్‌తో డిశ్చార్జ్ చేయించాలని చూశారన్నారు. అరెస్టుల ద్వారా టీడీపీని భయపెట్టలేరని.. ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. కోర్టు ఉత్తర్వులను ధిక్కరించి మాజీ మంత్రి, ఎమ్మెల్యే అచ్చెన్నాయుడిని అర్ధరాత్రి బలవంతంగా డిశ్చార్జి చేయడానికి ప్రయత్నించడంపై మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. అచ్చెన్నాయుడి అరెస్ట్ నుంచి అర్ధరాత్రి బలవంతపు డిశ్చార్జి హైడ్రామా వరకు ప్రభుత్వ కక్షసాధింపు స్పష్టంగా కనిపిస్తోందని మండిపడ్డారు. 3 రోజులు ఆస్పత్రి బెడ్‌పైనే విచారణకు అనుమతి ఇచ్చిన కోర్టును కూడా ధిక్కరిస్తారా అని ప్రశ్నించారు. అర్ధరాత్రి డిశ్చార్జి చేయాలని డాక్టర్లపై పోలీసులు ఒత్తిడి తేవడం దుర్మార్గమన్నారు. ఒకటికి రెండు సార్లు శస్త్రచికిత్స చేయించుకుని కోలుకుం టున్న వ్యక్తితో ఇంత దారుణంగా వ్యవహరిస్తారా అని సోమిరెడ్డి మండిపడ్డారు. అరెస్ట్ రోజు 14 గంటల పాటు కారులో తిప్పడం నుంచి ఇప్పటివరకు అచ్చెన్న విషయంలో మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోందన్నారు. ఈ రాష్ట్రంలో సామాన్యుల నుంచి సీనియర్ ప్రజాప్రతినిధుల వరకు అందరి విషయంలో హక్కుల ఉల్లంఘన జరుగుతుండటం దురదృష్టకరమని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి వ్యాఖ్యానించారు.

# ప్రజావేదిక కూల్చివేతతో జగన్ పగ్గాలు

### ఏడాదిగా అదే ధోరణిలో సాగుతున్న పాలన

### మండిపడ్డ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కళా వెంకట్రావు

అమరావతి,జూన్25(ఆర్ఎన్ఎ): వైసీపీ విధ్వంసానికి ఏడాది అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కళా వెంకట్రావు పేర్కొన్నారు. ప్రజావేదిక కూల్చి 9 కోట్ల రూపాయల ప్రజాధనాన్ని మట్టిపాలు చేశారన్నారు. శుభకార్యంతో కాకుండా ప్రజావేదిక కూల్చివేతతో జగన్ పాలన ప్రారంభించారని కళా వెంకట్రావు విమర్శించారు. అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాల్లో పండ్ల చెట్లు నరికి వేశారన్నారు. నెల్లూరు, మడకశిరలో పేదల ఇళ్లను కూల్చివేశారన్నారు. ఆస్తులు కూల్చి వేయడం, శిలా ఫలకాలు కూల్చివేయడం, భూములు, గనులు కబ్జా చేయడం, ప్రశ్నించిన ప్రతిపక్షాలపైన, సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ అరెస్టులు, వేధింపులు నిత్యకృత్యమయ్యాయన్నారు. నేడు కూల్చివేసిన ప్రజావేదికను సందర్శించడానికి వెళ్తున్న వర్ల రామయ్య, దేవినేని ఉమామహేశ్వరరావు, కొల్లు రవీంద్ర, ఆలపాటి రాజా, నక్కా ఆనంద్ బాబు, తెనాలి శ్రవణ్ కుమార్, అశోక్ బాబు, బచ్చుల అర్జునుడు, పిల్లి మాణిక్యాలరావు తదితర టీడీపీ నాయకుల అక్రమ అరెస్టులను ప్రజలు, మేధావులు ఖండించాలని కళా వెంకట్రావు కోరారు. ఇదిలావుంటే ఏపీలో జగన్మోహన్ రెడ్డి విధ్వంసకర పాలన కొనసాగిస్తున్నారని టీడీపీ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ పేర్కొన్నారు. కక్ష సాధింపు ధోరణితో ప్రజావేదికను జగన్ కూల్చివేయించారన్నారు. జగన్ ఏడాది పాలనంతా విధ్వంసాలు, కూల్చివేతలేనన్నారు. ఏడాది కాలంలో ఒక్క నిర్మాణమైన జగన్ చేపట్టారా? అని పట్టాభిరామ్ ప్రశ్నించారు. ప్రజావేదిక కూల్చి రూ.9 కోట్ల ప్రజాధనం వృథా చేశారన్నారు. తాడేపల్లి ప్యాలెస్‌లో విలాసాల కోసం కోట్లు ఖర్చు పెట్టారన్నారు. ప్రజావేదిక దగ్గరకు వచ్చిన ప్రజలకు నాడు చంద్రబాబు భోజనం పెట్టి పంపేవారన్నారు. తాడేపల్లి ప్యాలెస్‌కు ప్రజలు రాకుండా జగన్ 144 సెక్షన్ పెట్టారని పట్టాభిరావ్ విమర్శించారు. అచ్చెన్నాయుడిని వైసీపీ ప్రభుత్వం చంపేయాలనుకుంటోందా? అని ప్రశ్నించారు. 108 కుంభకోణాన్ని బయటపెడితే ప్రభుత్వం సమాధానం చెప్పలేకపోయిందన్నారు.

# పోలీసు శిక్షణకేంద్రం(సిపిటిసి)లో 6వ విడత హరితహారం ప్రారంభం



కరీంనగర్, జూన్ 25 (నేటినిజం ప్రతినిధి): కరీంనగర్‌లోని సిటి పోలీస్ శిక్షణకేంద్రం(సిపిటిసి)లో గురువారం నాడు 06వ విడత హరితహారం కార్యక్రమాన్ని పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటేందుకు తీసుకున్న జాగ్రత్తలను క్షుణ్ణంగా పరిశీలించారు.

ఈ 6వ విడత హరితహారం కార్యక్రమంలో కమిషనరేట్ పోలీసులు 50వేల మొక్కలను నాటడం లక్ష్యంగా ముందుకుసాగుతున్నారు. ఇందులో 25వేల మొక్కలు కరీంనగర్ రాంనగర్‌లోని పోలీసు శిక్షణ కళాశాల(పిటిసి)లో కార్యక్రమాన్ని ప్రారంభించిన విషయం విదితమే. గతంలో జరిగిన హరితహారం కార్యక్రమాల సందర్భంగా నాటి మొక్కలు నేడు మహావృక్షాలు అవతరించాయి. కేవలం సిపిటిసిలోనే 35వేల మొక్కలు మహావృక్షాలుగా ఎదిగాయి. మియావాకి పద్ధతిలో చిట్టడవుల పెంపకాన్ని ఒక ఎకరం విస్తీర్ణంలో 12,500మొక్కలను కొనసాగిస్తున్న విషయం కూడా విదితమే.

ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి మాట్లాడుతూ నాటిన ప్రతిమొక్కను సంరక్షించే చర్యలు తీసుకున్నప్పుడే లక్ష్యం నెరవేరుతుందన్నారు. మొక్కల నాటేసందర్భంలో పూర్తిస్థాయిలో ఆమొక్కలు సంరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. కమిషనరేట్ పోలీసుల ఆధ్వర్యంలో హరితహారంలోనాటిన మొక్కలు సిపిటిసిలో చిట్టడవుల పెంపకం ప్రాంతాల్లో వాకర్స్ కోసం ప్రత్యేకంగా ట్రాక్‌ను రూపొందించే ప్రణాళికను రూపొందించామని తెలిపారు. పకృతిని ఆస్వాదించేందుకు ఎక్కువమంది వాకర్స్ ఈ ప్రాంతాలకు వచ్చే అవకాశం ఉందని చెబుతూ లేక్‌పోలీస్ అవుట్‌పోస్ట్ ఏర్పాటుద్వారా కలుగుతున్న ప్రయోజనాలను వివరించారు. సిపిటిసిలో వివిధ ప్రాంతాల్లో మొక్కలునాటనున్న ప్రదేశాలను పరిశీలించారు. మొక్కలు సంరక్షించేందుకు తీసుకున్న చర్యలు, సారవంతమైన భూమి ఏర్పాటుకోసం ఇతరప్రాంతాల నుండి తెప్పిస్తున్న వివిధరకాల మట్టి, మొక్కలునాటేందుకు తీసుకుంటున్న చర్యలను కూడా ఈ సందర్భంగా పరిశీలించారు. ప్రారంభరోజున ఒకవెయ్యిమొక్కలను నాటారు.

ఈ కార్యక్రమంలో సిపిటిసి ప్రిన్సిపాల్, అడిషనల్ డిసిపి(ఎల్అండ్ఓ), ఎస్ శ్రీనివాస్, జి చంద్రమోహన్(పరిపాలన), ఏసిపిలు శివభాస్కర్, పి అశోక్, విజయసారధి, శంకర్‌రాజు, మదన్‌లాల్, ఎస్‌బిఐ ఇంద్రసేనారెడ్డి, ఇన్స్‌పెక్టర్లు నాగేందర్, కిరణ్‌కుమార్, విజయ్‌కుమార్, లక్ష్మణ్‌బాబు, విజ్ఞాన్‌రావు, రమేష్, నటేష్, తిరుమల్,నాగార్జునరావులతోపాటు వివిధ విభాగాలకు చెందిన అధికారులు,సిబ్బంది,శిక్షణలోఉన్న కానిస్టేబుళ్ళు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటికి ఆరు మొక్కలు నాటాలి : సీఎం కేసీఆర్

నర్సాపూర్,జూన్ 25: తెలంగాణ ప్రజల వ్యక్తిత్వపటిమ చాలా గొప్పదని, మనం తలుచుకుంటే జరగని పని లేదని సీఎం కేసీఆర్ అన్నారు. మనపూర్వికులు మనకోసం ఎంతో కష్టపడినందుకే మనం ఇవాళ ఇట్లున్నామని, మన భవిష్యత్ తరాల కోసం మనం కూడా ఎంతో కొంత చేయాలి కదా. అందుకే మళ్లీ పాత అడవులు వచ్చి తీరాలి. ప్రతి ఇంటికి ఆరు చెట్లు నాటాలని సీఎం పిలుపునిచ్చారు. మెదక్ జిల్లా నర్సాపూర్‌లో ఆరోవిడత హరితహారం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ప్రతి గ్రామానికి ట్రాక్టర్, నీళ్ల ట్యాంకర్‌ను ఈ ప్రభుత్వం ఇచ్చిందని, నాటిన మొక్కలను బతికించుకునే బాధ్యత ఎవరికి వారు స్వచ్ఛందంగా తీసుకోవాలని కోరారు. తెలంగాణలో ప్రతిగ్రామంలో నర్సరీ ఉందని, దేశంలో ఏరాష్ట్రంలోనూ ఈ పరిస్థితి లేదన్నారు.

'92 వేల ఎకరాల అడవిని పోగొట్టుకున్నాం. సినిమా షూటింగులకోసం నర్సాపూర్ అటవీప్రాంతాన్నే ఎంచుకునేవాళ్లు. గతంలో నర్సాపూర్ అడవుల్లో చాలా షూటింగులు జరిగాయి. సమష్టి కృషితోనే ఈ అటవీ ప్రాంతానికి పునరుజ్జీవం కలుగుతుంది. అడవులు కాపాడుకునే బాధ్యత మనందరిపై ఉంది. సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు కథానాయకులు కావాలి. ఇందులో ప్రజల సహకారం కూడా కావాలి' అని సీఎం అన్నారు. ప్రతి ఇంటికి ఆరు మొక్కలు నాటాలి. నాటిన మొక్కలకు కుటుంబ సభ్యుల పేర్లు పెట్టాలి. మొక్క ఎండిపోతే బిడ్డ ఎండిపోయినట్లు అని సెంటిమెంట్ క్రియేట్ చేయాలని చెప్పారు.




కరీంనగర్ ఆర్టీసీ వర్క్‌షాపు సమీపంలో హరితహారంలో భాగంగా మొక్కలు నాటిన మంత్రి గంగుల కమలాకర్. చిత్రంలో ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ రావు, మేయర్ సునీల్ రావు, కలెక్టర్ శశాంక్, కమిషనర్ క్రాంతి తదితరులు ఉన్నారు.

# పట్టణాలు, గ్రామాలు పచ్చదనంతో ఉట్టిపడాలి

కరీంనగర్, జూన్ 25 (నేటినిజం ప్రతినిధి): జిల్లాలో హరితహారంలో భాగంగా పట్టణాలు, గ్రామాలు పచ్చదనంతో ఉట్టిపడేలా మొక్కలు నాటాలని, అలాగే రహదారులు పచ్చని చెట్లతో కమ్ముకొనే విధంగా విరివిరిగా చెట్లు నాటాలని పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. ఆరో విడుత హరితహారంలో భాగంగా జిల్లా కలెక్టర్ కే.శశాంక, ఎమ్మెల్సీ నారాదాసు లక్ష్మణ్ రావు, మేయర్ సునిల్ రావు, కమిషనర్ క్రాంతితో కలిసి మొక్కలు నాటారు. స్థానిక ఆర్.టి.సి. వర్కుషాపు సమీపంలో మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాను ఆకుపచ్చ కరీంనగర్ గా తయారు చేసేందుకు ఆరో విడత హరితహారంలో భాగంగా జిల్లాలో 55 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, అందులో నగరంలో 14.5 కిలోమీటర్ల పరిధిలో 10 లక్షల మొక్కలు నాటుతామని మంత్రి గంగుల కమలాకర్ స్పష్టం చేశారు. గతంలో అడవులకు నిలయంగా ఉన్న కరీంనగర్ జిల్లాకు చెట్ల పెంపకంతో పూర్వ వైభవం తీసుకొస్తామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పాన్ని నెరవేర్చేందుకు ప్రతి ఒక్కరు ముందుకు సాగాలని మంత్రి గంగుల కమలాకర్ విజ్ఞప్తి చేశారు.

# ఎమ్మెల్సీగా డొక్కా ఏకగ్రీవ ఎన్నిక

అమరావతి,జూన్25(ఆర్ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యునిగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డొక్కా మాణిక్య వరప్రసాద్ ఏకగ్రీంగా ఎన్నికయ్యారు. గురువారం సాయంత్రం ఎమ్మెల్సీ ఎన్నిక నామినేషన్ల గడువు ముగిసింది. అయితే ఎమ్మెల్సీ స్థానానికి మాణిక్య వరప్రసాద్ ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైంది. ఈ ఏడాది ప్రారంభంలో శాసనమండలి ప్రత్యేక సమావేశాలు జరుగుతున్న సమయంలోనే.. టీడీపీలో సీనియర్ నాయకుడిగా ఉన్న డొక్కా మాణిక్యవరప్రసాద్ తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి,ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో ఆయన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. అంతకుముందు ఉదయం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా డొక్కా మాణిక్య వరప్రసాద్ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. అసెంబ్లీ కార్యదర్శి బాలకృష్ణమాచార్యులుకు నామినేషన్ పత్రాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ప్రభుత్వ చీఫ్ విప్ శ్రీకాంత్ రెడ్డి, ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్యేలు అంబటి రాంబాబు, నంబూరి శంకర్‌రావు, ఉండవల్లి శ్రీదేవి, జంగా కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# సీతారామ ప్రాజెక్టుతో మారనున్న సీన్

## కోనసీమగా ఈ ప్రాంతం అభివృద్ధి: మంత్రి సత్యవతి

మహబూబాబాద్,జూన్25(ఆర్ఎన్ఎ): సీతారామ ప్రాజెక్టు నీటితో జిల్లాను కోనసీమగా మారుస్తానని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు.



3.హరితహారంలో భాగంగా మహబూబాబాద్ జిల్లా మరిపెడ పార్కులో మొక్కలు నాటిన మంత్రి సత్యవతి రాథోడ్. చిత్రంలో ఎంపి మాలోత్ కవిత, ఎమ్మెల్యే రెడ్యానాయక్ తదితరులు ఉన్నారు.

త్వరలోనే ప్రాజెక్టు పూర్తవుతుందన్నారు. దీంతో ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని అన్నారు. మరిపెడ మండలం కేంద్రంలో మున్సిపల్ పార్క్‌లో ఆరో విడత హరితహారం పురస్కరించుకొని మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత, డోర్నకల్ శాసనసభ్యుడు రెడ్యా నాయక్‌తో కలిసి మంత్రి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టుతో ఎస్సారెస్పీ కాలువ ద్వారా సాగునీరు అందడం రైతుల జీవితాల్లో వెలుగులు నింపినట్లు అయిందన్నారు.

అదేవిధంగా జిల్లాలో ప్రవహిస్తున్న నాలుగు నదులు పాలేరు, ఆకేరు, మున్నేరు, అలిగేరు నీటితో పాలేరు రిజర్వాయర్‌కు చేరుతుందని, పాలేరు రిజర్వాయర్ కు అనుసంధానం చేసి రైతులు రెండు పంటలు పండించుకునే విధంగా కృషి చేస్తానన్నారు. రైతులు ఒకే పంట వేసి రేటు లేక ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో నియంత్రిత సాగు విధానాన్ని అమల్లోకి తెచ్చేందుకు 82 వేదికలు చేపట్టామని తెలిపారు. ఇది మంచి ఫలితాలు ఇవ్వబోతున్నదని అన్నారు. రైతులకు మంచి జరగాలన్నదే సిఎం కెసిఆర్ ఆకాంక్ష అన్నారు.

# ఆకుపచ్చ తెలంగాణ లక్ష్యం కావాలి: ఎంపి సంతోష్

హైదరాబాద్,జూన్25(ఆర్ఎన్ఎ): ఆకుపచ్చ తెలంగాణెళి అందరి లక్ష్యం కావాలని టిఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్ కుమార్ రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు. ఆరో విడత హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. మొక్కలు నాటి అడవులను సృష్టించాలని ఆయన పేర్కొన్నారు. హరితహారంలో భాగంగా గురువారం సంతోష్ కుమార్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విరివిగా మొక్కలు నాటి సిఎం కెసిఆర్ కలలను సాకారం చేయాలని ఆయన కోరారు. పర్యావరణ పరిరక్షణకు, మొక్కలు నాటడం, అడవులు సృష్టించడం ఒక్కటే మార్గమని ఆయన స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరు ఐదు మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని ఆయన ప్రజలకు సూచించారు.

# ప్రజాస్వామ్యాన్ని కూనీ చేసింది కాంగ్రెస్సే

### ఆ పార్టీయే స్వేచ్ఛ గురించి మాట్లాడుతోంది

### -బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్ రావు

హైదరాబాద్,జూన్25(ఆర్ఎన్ఎ): ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన కాంగ్రెస్ స్వేచ్ఛ గురించి మాట్లాడు తోందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్ రావు ఎద్దేశా చేశారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన పార్టీ కాంగ్రెస్ పార్టీయేనని.. ఆనాటి ప్రధాని ఇందిరా గాంధీ నియంతలా వ్యవహరించి ప్రజాస్వామ్యాన్ని కాలరాసింది అందరూ మర్చిపోయాంనుకుంటోందన్నారు. జూమ్ యాప్ ద్వారా బీజేపీ నాయకులు, ముఖ్య కార్యకర్తలతో ఆయన మాట్లాడారు.ఎమర్జెన్సీ విధించి ప్రజల హక్కులను కాలరాసిన కాంగ్రెస్ ఈ రోజు స్వేచ్ఛ గురించి మాట్లాడుతుండడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్న కొన్ని పార్టీ ల నాయకులు తమ పార్టీలలో అంతర్గత ప్రజాస్వామ్యం గురించి మాట్లాడడం లేదన్నారు. దేశంలో కాంగ్రెస్ తో సహా ఎక్కువగా కుటుంబ పార్టీ లు ఉన్నాయని.. ఒక్క బీజేపీ తప్ప మిగతా పార్టీలన్నీ కుల, కుటుంబ పార్టీలే ఉన్నాయన్నారు. దేశంలో బీజేపీ అధికారంలో ఉన్నన్ని రోజులు ప్రజాస్వామ్యానికి ఢోకా ఉండదని.. ప్రధాని మోడీ నాయకత్వంలో రాజకీయ, ఆర్థిక, సామాజిక ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేశారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రజాస్వామ్య వ్యతిరేకతను, అవినీతిని, కుటుంబ రాజకీయాలను.. దేశ వ్యతిరేక కార్యకలాపాలను పెంచిపోషిస్తోందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్ రావు దుయ్యబట్టారు.

# మెదక్ జిల్లాలో అడవులను మళ్లీ పునరుద్ధరించాలి

### ఒకప్పుడు ఎండాకాలంలోనూ వర్షం పడేది

### ఇక్కడ సినిమా షూటింగ్‌లు కూడా జరిగేవి

### నర్సాపూర్ అటవీ ప్రాంత అభివృద్ధిపై సిఎం కెసిఆర్

మెదక్,జూన్25(ఆర్ఎన్ఎ): మెదక్ జిల్లాలో ఒకప్పుడు అడవులు విపరీతంగా ఉండేవని, వాటిని నాశనం చేశారని సిఎం కెసిఆర్ అన్నారు. తిరిగి వాటిని పునరుద్ధరించాల్సి ఉందన్నారు. మొక్కలు నాటి అడవులను పునరుద్ధరించుకోవాలన్నారు. చాలా సందర్భాల్లో తాను స్వయంగా తూప్రాన్, నర్సాపూర్, సంగారెడ్డికి కారులో తిరిగానని, 1985లో కూడా తిరిగానని.. రోజూ ఇక్కడ సినిమా షూటింగ్‌లు జరిగేవని సీఎం కేసీఆర్ అన్నారు. ఆరోవిడత హరితహారం కార్యక్రమాన్ని గురువారం మెదక్ జిల్లాలో ప్రారంభించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇప్పుడు ఆ అడవంతా పోయి 48 డిగ్రీల ఎండ వచ్చిందన్నారు. పాత మెదక్ జిల్లా నర్సాపూర్‌లో ఖచ్చితంగా వర్షం పడేదని, ఇప్పుడు ఇక్కడే కరువు వచ్చిందన్నారు. అడవులను మనమే మళ్లీ పెంచాలని, మనం బాగుపడాలంటే మనకు మనమే మేలుకోవాలని.. వేరే మార్గమే లేదని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. మనం మొండిపట్టు పట్టి.. నర్సాపూర్ అడవి తిరిగి రావాలన్నారు.

మొక్కలు పెంచడం అటవీ శాఖ పని కాధని, మనదేనని సీఎం కేసీఆర్ అన్నారు. డబ్బులు మనకు సమస్యే కాదన్నారు. తెలంగాణకు అద్భుతమైన ఆర్థిక వ్యవస్థ ఉందని, మంచి అధికారులు ఉన్నారని, అందరూ కలిసి మొక్కలు పెంచాలని సీఎం పిలుపు ఇచ్చారు. తెలంగాణ వంద శాతం ధనిక రాష్ట్రమని కేసీఆర్ మరోసారి స్పష్టం చేశారు. ఎవడో సన్నాసి విమర్శలు చేస్తే పట్టించుకోమన్నారు. మిషన్ భగీరథ నీళ్లు వస్తున్నాయని ఎవరైనా అనుకున్నారా? సక్సెస్ అయింది కదా అని అన్నారు. ఎమ్మెల్యేలు, మంత్రులు బయటికి వెళ్లితే బిందెల ప్రదర్శన కనిపించేదని... ఇవాళ బిందెలు బయట కనబడుతున్నాయా? అని ఆయన ప్రశ్నించారు. సబ్ స్టేషన్లు రావాలంటే గగనముండే... ఇప్పుడు బిస్కెట్ల లెక్కన సబ్ స్టేషన్లు ఇచ్చామన్నారు. కాళేశ్వరం నీరు ఏడాదిలోగా నర్సాపూర్ దాటి సంగారెడ్డి వరకు పోతుందని, యాసంగిలో కూడా వానలు లేకున్నా పంటలు వేయవచ్చునని సీఎం కేసీఆర్ అన్నారు. సూర్యాపేటలో నీటి కరువుండే.. తాను పోయిన ప్రతి సారి నీళ్ల కోసం అడిగే వారని, ఇప్పుడు నీళ్లు వచ్చాయని, తనను చెండులాగ ఎగురవేశారన్నారు. మనం ఎంత సంపాదించినా ముందు తరాలకు బతకగలిగే పరిస్థితి ఉండాలన్నారు. మన తాతలు ఎన్నో తరాలు పని చేస్తేనే మనం ఇలాగున్నామన్నారు. తాను సిద్ధిపేట ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు సిద్దిపేటకు హరితహారం పెట్టానని, పదివేల మొక్కలకు తలలు పట్టుకున్నామన్నారు. తెలంగాణ అడవులను కలప దొంగలకు అప్పగించారని, గతంలో..వాళ్లు పట్టుబడ్డరని చెప్పారు. అయితే వాళ్లు ఎవరో చెప్పనన్నారు. కలప దొంగలపై ఇంటలిజెన్స్ నిఘా పెట్టామన్నారు. ఇవాళ ప్రతి ఊరిలో నర్సరీ, ట్యాంకర్ ఉన్న రాష్ట్రం తెలంగాణ ఒక్కటేనని, తండాలు పంచాయతీలు చేయాలని కోరితే మనమే చేశామని, ఏ ప్రభుత్వం చేయలేదని విమర్శించారు. కమిట్ మెంట్ ఎక్కడికక్కడే జరగాలన్నారు. పైన ఉన్నోడి దమాక్ బాగుంటే కిందోని దమాక్ బాగుంటదని సీఎం కేసీఆర్ వ్యాఖ్యానించారు.

# తమిళనాడు సర్కార్ కీలక నిర్ణయం

### జిల్లాల పరిధిలో రాకపోకలపై ఆంక్షలు

### చెన్నైలో కేసుల సంఖ్యతో ప్రజల్లో ఆందోళన

చెన్నై,జూన్25(ఆర్ఎన్ఎ): ఇండియాలో కరోనా కేసులు భారీగా పెరుగుతున్న క్రమంలో మహారాష్ట్ర, ఢిల్లీ, తమిళనాడు రాష్ట్రాల్లో అత్యధిక కరోనా కేసులు నమోదవుతున్నాయి. తమిళనాడులో ఇప్పటి వరకు 67వేలకు పైగా కేసులు నమోదయ్యాయి. తీవ్రత రోజు రోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ఓ కీలక నిర్ణయం తీసుకున్నది. జిల్లాల పరిధిలో రాకపోకలపై ఆంక్షలు విధించింది. జిల్లాల సరిహద్దులు మూసేస్తూ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ, ప్రైవేట్ వాహనాలను సైతం జిల్లా దాటి వెళ్లేందుకు అనుమతులు నిరాకరిస్తున్నట్టు ప్రభుత్వం తెలిపింది. ఒక జిల్లా నుంచి మరొక జిల్లాకు వెళ్ళాలి అంటే తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని, పాస్ ఉన్నవాళ్లకు మాత్రమే జిల్లా దాటే అవకాశం ఉంటుందని ప్రభుత్వం తెలిపింది. జూన్ 30 వ తేదీ వరకు ఈ నిబంధనలు కఠినంగా అమలు చేస్తున్నట్టు ప్రభుత్వం తెలిపింది. ఇదిలావుంటే తమిళనాట కరోనా వైరస్ ధాటికి ప్రజలు వణికిపోతున్నారు. ఇతర జిల్లాలతో పోలిస్తే చెన్నై నగరం అందరినీ భయభ్రాంతులకు గురిచేస్తోంది. మార్చి 24వ తేదీ నుంచి అమల్లోకి వచ్చిన లాక్‌డౌన్‌ను నెలరోజుల క్రితం స్వల్పంగా సడలించారు. చెన్నైలో ఇంకా లాక్‌డౌన్ కొనసాగుతూనే ఉంది. అయినా వైరస్ వ్యాప్తికి అంతేలేకుండా పోతోంది. రోజు రోజుకూ పాజిటివ్ కేసుల సంఖ్య పెరిగిపోవడమే గాని తగ్గుముఖం పట్టడం లేదు. వైరస్ వ్యాప్తి అదుపులోకి వస్తుందో లేదో ఎవరికీ అంతుబట్టడం లేదు. చెన్నైలో రోజుకు వెయ్యి మందికి పైగా బాధితులుగా మారిపోతున్నారు. ఒక్క చెన్నైలోనే 2.5 లక్షల ఇళ్లు ప్రభుత్వ పర్యవేక్షణ క్వారంటైన్లుగా ఉన్నాయని మంత్రి ఉదయకుమార్ తెలిపారు. ప్రభుత్వం ఎన్ని చర్యలు చేపట్టినా, ఆంక్షలు విధించినా ప్రజలు పాటించకపోవడంతో రాష్ట్రంలో వైరస్ వ్యాధిగ్రస్తుల సంఖ్య 62 వేలు దాటిపోయింది. ఇందులో 42 వేల మంది చెన్నైకి చెందిన వారు కావడం ఆందోళనకరంగా మారింది. ఈ దశలో చెన్నైలో ఉండేందుకే ప్రజలు భయపడుతూ సుమారు 10 లక్షల మంది సొంతూళ్లకు వెళ్లిపోయారు. ఇతర జిల్లాల్లో సైతం పాజిటివ్ కేసులు పెరిగిపోతున్నాయి. చెన్నై తరువాత మదురై, దిండుగల్లు, వేలూరు, కోయం బత్తూరు, సేలం, ఈరోడ్, కృష్ణగిరి, తిరుప్పూరు, తంజావూరు, తిరుచ్చిరాపల్లి, తిరునెల్వేలి, తూత్తుకూడి, నాగర్‌కోవిల్ జిల్లాల్లో వైరస్ కేసులు పెరిగిపోయే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇదిలా ఉండగా, జూలై 15వ తేదీ తరువాత రాష్ట్రంలో పాజిటివ్ కేసుల సంఖ్య 2.7 లక్షలను దాటే ప్రమాదం పొంచి ఉందని ఎంజీఆర్ యూనివర్సిటీ నిర్వహించిన సర్వేలో తేలింది. ఇందులో కేవలం చెన్నైలోనే 60 శాతం మంది వైరస్ బారిన పడుతారని సర్వే స్పష్టం చేసింది. చెన్నైలో కఠిన నిబంధనలు కొనసాగుతూనే ఉన్నాయి. అయినా పాజిటివ్ కేసులో జోరుకు కళ్లెం పడలేదు.

# ఆకుపచ్చని తెలంగాణ కోసం పాటుపడుదాం



గద్వాల,జూన్ 25: మానవ మనుగడకు ప్రాణాధారమైన మొక్కలను ప్రతి ఒక్కరు పెంచాలని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు.

ఆరో విడత హరితహారం కార్యక్రమాన్ని జిల్లాలో మంత్రి ప్రారంభించి మాట్లాడారు. ప్రతి గ్రామంలో సర్పంచ్, కార్యదర్శులు, ప్రజలు కలిసికట్టుగా మొక్కలు నాటి హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆకుపచ్చని గద్వాలకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం జిల్లాలో మల్దకల్ మండలం పెద్దపల్లె గ్రామంలో రైతు వేదిక నిర్మాణానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రూ. 22 లక్షల వ్యయంతో నిర్మాణం చేపట్టే హరిత వేదిక భవనానికి మంత్రి భూమిపూజ చేశారు.

# వ్యక్తిగత మరుగుదొడ్ల లక్ష్యాన్నిచేరుకోవాలి

### గ్రామాలు స్వచ్ఛంగా ఉండేలా చూడాలి

### మొక్కలు పెంచి ప్లాస్టిక్‌ను దూరం చేయాలి: కలెక్టర్

మెదక్,జూన్25(నేటినిజం ప్రతినిధి): జిల్లాలోని పలు గ్రామాలలో పెండింగులో ఉన్న వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం పనులు త్వరితగతిన పూర్తి చేసేలా మండలాల ప్రత్యేక అధికారులు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకుని పనిచేయాలని కలెక్టర్ ధర్మారెడ్డి అన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో పెండింగులో ఉన్న మరుగుదొడ్ల నిర్మాణాలను సాధ్యమైనంత తొందరగా పూర్తి చేయాలన్నారు. ప్రతి గ్రామంలో తడి, పొడి చెత్త వేరువేరుగా సేకరించడానికి సిబ్బందికి అవగాహన కల్పించాలన్నారు. చెత్తను కాల్చి వేయడం వల్ల కలిగే అనర్థాలను వారికి తెలియజేయాలన్నారు. అలాగే ప్రతి గ్రామంలోని మహిళా సంఘాలను సంఘటితం చేసి వారికి తడి, పొడి చెత్తను వేరుచేసే విధానాలపై అవగాహన పెంపొందించా లన్నారు. జలశక్తి అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ ఇంకుడుగుంతలు నిర్మించాలని బోరుబావుల రిచార్జి పనులపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అన్ని ప్రభుత్వ భవనాల వద్ద ఇంకుడుగుంతలలోకి వర్షం నీరు వెళ్లేలా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి భూగర్భజలాల పెంపునకు కృషి చేయాలన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో హరితహారం, జలశక్తి అభియాన్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని, ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని తగ్గించాలని అధికారులకు సూచించారు. ఇందుకోసం అన్ని మండలాల ప్రత్యేక అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. హరితహారం, జలశక్తి అభియాన్ కార్యక్రమాల విజయవంతం కోసం కృషి చే యాలని అధికారులకు సూచించారు. ప్లాస్టిక్ కవర్ల వినియోగం విపరీతంగా పెరిగిపోవడం వల్ల అనేక అనర్థాలు కలుగుతున్నాయన్నారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

# యుద్ధం వస్తుందని భయపడ్డాం : పాకిస్తాన్

ఇస్లామాబాద్,జూన్ 25: లడాఖ్‌లోని గల్వాన్ లోయలో భారత్-చైనా సైనికుల ఘర్షణ నేపథ్యంలో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగి యుద్ధానికి దారితీస్తుందని, ఇదే సమయంలో భారత్ తమపై కూడా యుద్ధానికి దిగుతుందని పాకిస్తాన్ ఆందోళన చెందినట్లు ఆ దేశ విదేశాంగ మంత్రి షా మెహమూద్ ఖురేషీ చెప్పారు. ఢిల్లీలోని పాకిస్తాన్ హైకమిషన్ కార్యాలయం నుండి 50 శాతం ఉద్యోగులను ఉపసంహరించుకోవాలని భారత్ సూచించడంపై ఖురేషి అసంతృప్తి వ్యక్తం చేశారు. మేము కూడా మా దేశంలోని భారత హైకమిషన్ ఉద్యోగులను తమ దేశానికి వెళ్లిపొమ్మంటాం అని అన్నారు.

గల్వాన్ లోయలో భారత్-చైనా సైనికుల మధ్య జరిగిన ఘర్షణను తాము సీరియస్‌గా తీసుకొన్నామని, వారి మధ్య చెలరేగిన ఉద్రిక్తత ఎక్కడ తమపైకి యుద్ధం రూపంలో వస్తుందని భయపడ్డామన్నారు. అయితే, తామేమీ చూస్తూ కూర్చోమని, తగిన విధంగా జవాబిస్తామని చెప్పారు. మే 31 న ఇద్దరు పాకిస్తాన్ ఎంబసీ అధికారులు గూఢచర్యం చేస్తున్నట్లు ఢిల్లీ పోలీసులు కనుగొన్నారు. ఇద్దరు అధికారులు ఒక వ్యక్తిని డబ్బుతో ఆకర్షించి భద్రతా పత్రాలు తీసుకుంటున్నప్పుడు వారిని రెడ్ హ్యాండెడ్‌గా అరెస్టు చేశారు. అనంతరం వీరిని 24 గంటల్లోగా దేశం విడిచిపోవాలని భారత ప్రభుత్వం ఆదేశించింది. జూన్ 15 న ఇస్లామాబాద్‌లో భారత హైకమిషన్‌కు చెందిన ఇద్దరు ఉన్నతాధికారులను కిడ్నాప్ చేసి తీసుకెళ్లిన దుండగులు హిట్ అండ్ రన్ కేసులో నిందితుడిగా ఒప్పుకోవాలంటూ గాయపరిచి అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసు సమాచారం అందిన వెంటనే భారత్.. పాకిస్తాన్ హైకమిషన్ కు సమన్లు ??పంపింది. అరెస్టు చేసిన అధికారులను ఇబ్బంది పెట్టవద్దని, వారిని ఏ విధంగానూ ప్రశ్నించవద్దని పాకిస్తాన్‌కు తెలిపింది. దాంతో ఆ అధికారులను వెంటనే వారి కార్లతో పాటు భారత రాయబార కార్యాలయం వద్ద దిగబెట్టి వెళ్లిపోయిన సంగతి తెలిసిందే.

# ఇక రోజూ 13వేల మందికి దర్శనం

### నేటి నుంచే అమల్లోకి రానున్న టిటిడి నిర్ణయం

తిరుమల,జూన్25(ఆర్ఎన్ఎ): శ్రీవారి ఆలయంలో భక్తుల దర్శనాల సంఖ్యను టిటిడి క్రమంగా పెంచుతోంది. ఇప్పటికే ప్రతి నిత్యం 10వేల మంది భక్తులకు టీటీడీ దర్శనం కల్పిస్తోంది.

శుక్రవారం నుంచి మరో 3వేల మందికి అదనంగా స్వామి వారి దర్శనం కల్పించాలని నిర్ణయించింది. ఇప్పటికే ఆన్‌లైన్‌లో ఈ నెల 30వ తేదీ వరకూ ప్రతి నిత్యం మరో 3 వేల టిక్కెట్లను టీటీడీ విడుదల చేసింది. జులై మొదటి వారం నుంచి దర్శనం సంఖ్యను మరింత పెంచనుంది. దర్శన సమయంలో కూడా మార్పులు చేసే అవకాశం ఉంది.

# హరితహారం ఒక ఉద్యమంలాగా వేములవాడలలో చేపడదాం

### - ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షణ బాధ్యతలు చేపట్టాలి

### - మున్సిపల్ అధ్యక్షురాలు రామతీర్థపు మాధవి రాజు

వేములవాడ, జూన్ 25(నేటినిజం ప్రతినిధి) :తెలంగాణ రాష్ట్రాన్ని పచ్చదనంతో విరాజిల్లే లా భవిష్యత్తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందించేందుకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసిఆర్ తెలంగాణకు హరితహారం కార్యక్రమాన్ని చేపట్టారని ,ఆకుపచ్చ తెలంగాణ లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కె?సిఆర్ అడుగులు వేస్తున్నారని వేములవాడ మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి రాజు అన్నారు

గురువారం హరితహారం కార్యక్రమం ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ , పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ , నియోజకవర్గ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబు ఆదేశాల మేరకు మున్సిపల్ పరిదిలోని 4వ వార్డు, 5వ వార్డు లలో 50 మొక్కలను నాటి వాటికి గార్డులను ఏర్పాటు చేసి నీళ్లు పోయడం జరిగింది అని తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న హరితహారం కార్యక్రమం లో భాగంగా ప్రతి వార్డు లో మొక్కలు నాటి వాటిని పెంచే బాధ్యత ప్రతి ఒక్కరు తీసుకోవాల న్నారు. ప్రతి వార్డులో పచ్చదనం కనిపించేలా చర్యలు తీసుకుంటున్నా మన్నారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని ప్రతి వార్డులో పచ్చదనంతో వెల్లి విరిసే విధంగా మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతలు చేపట్టాలని అన్నారు . ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మట్ట శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మధు రాజేందర్, సెస్ డైరెక్టర్లు రామతీర్థపు రాజు ,జడల శ్రీనివాస్ ,టౌన్ ప్లానింగ్ అధికారి అంజయ్య ,కౌన్సిలర్లు, మారం కుమార్ , సిరిగిరి రామచంద్రం, బింగి మహేశ్ ,జోగిని శంకర్ ,యాచమనేని శ్రీనివాసరావు ,నిమ్మశెట్టి విజయ్ ,ఇప్ప పుల్లా అజయ్ ,నరాల శేఖర్ , కొండ పావని ,కొండ శ్రీలత ,వంగల దివ్య ,టీఆర్ఎస్ నాయకులు అన్నారం శ్రీనివాస్ ,కందుల కాంతికుమార్ ,కొండ కనకయ్య , వంగల శ్రీనివాస్,కొండ నర్సయ్య , మెప్మా, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.







మహబూబ్‌నగర్‌లో పలువురు కౌన్సిలర్లు కాంగ్రెస్‌ను వీడి మంత్రి శ్రీనివాస్ గౌడ్ సమక్షంలో టిఆర్ఎస్‌లో చేరిన దృశ్యం

# అక్రమంగా తరలిస్తున్న నిషేధిత పొగాకు ఉత్పత్తులు స్వాధీనం.

### - 3,00,000/- రూపాయలు విలువ చేసే గుట్కా స్వాధీనం...

### -ఇద్దరు అరెస్ట్...

వేములవాడ, జూన్ 25(నేటినిజం ప్రతినిధి) :కరోనా తీవ్రత దృష్ట్యా ప్రజలు ఇబ్బందులు పడుతుంటే కొంతమంది నిషేదిత గుట్కా వ్యాపారులు మాత్రం ఇదే అదునుగా భావించి కరీంనగర్ జిల్లా పరిధిలో గుట్కా దందాను యథేచ్ఛగా సాగిస్తున్నారు, కరీంనగర్ జిల్లా పరిధిలో గుట్కా వ్యాపారం చేస్తున్నారన్న పక్కా సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్ మరియు సైదాపూర్ పోలీస్ లు గుట్కా దందా చేస్తున్న శివానందుని లింగమూర్తి, ముషినం రవి, లను సైదాపూర్ మండలం లోని రాయికల్ గ్రామంలో చాకచక్యంగా పట్టుకోవడం జరిగింది .

వివరాల్లోకి వెళ్తే:

సైదాపూర్ మండలం లోని రాయికల్ గ్రామానికి చెందిన శివానందుని లింగమూర్తి అనే వ్యక్తి కరోనా సమయంలో గుట్కా ఉత్పత్తులకు గిరాకీ ఎక్కువగా ఉందని భావించి గుట్టుచప్పుడు కాకుండా నిషేధిత పొగాకు ఉత్పత్తులను అమ్ముతున్నాడన్న సమాచారం అందుకున్న కరీంనగర్ టాస్క్ ఫోర్స్ మరియు సైదాపూర్ పోలీసులు సైదాపూర్ మండలం లోని రాయికల్ గ్రామంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా రాయికల్ గ్రామానికి చెందిన శివానందుని లింగమూర్తి, మరియు సిద్దిపేట కు చెందిన ముషినం రవికి చెందిన : సెఫ్టీ డిజైర్ AP09bw6246 వాహనం లో గుట్కా ఉత్పత్తులతో ఉన్నటువంటి వాహనాన్ని స్వాధీనం చేసుకోవడం జరిగింది .



వారిద్దరినీ పట్టుకొని విచారించగా వీరు బీదర్ కు చెందిన భవాని చలియా షాప్ నుండి సైదాపూర్ కి సరఫరా చేస్తున్నారు అని అంగీకరించడం జరిగింది.

పట్టుబడ్డ నిందితులను సైదాపూర్ పోలీస్ స్టేషన్ లో అప్పగించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిందితులు.

1. శివానందుని లింగమూర్తి, బ/నీ వీరభద్రయ్య, ((గ్రా) రాయికల్, (మం) సైదాపూర్,
2, ముషినం రవి, బ/నీ నారాయణ, ((గ్రా) పుల్లూరు , (జిల్లా )సిద్దిపేట

గుట్కా వ్యాపారం పై ఉక్కుపాదం మోపుతామని ఇప్పటికైనా, ఇలాంటి అక్రమ వ్యాపారాలను మానుకోవాలని, గుట్కా దందా నిర్వహిస్తున్న వారిపై అనుమానిత షీట్లు తెరుస్తామని కరీంనగర్ పోలీస్ కమిషనర్ వి.బి.కమలాసన్ రెడ్డి హెచ్చరికలు జారీ చేయడం జరిగింది.

ఇట్టి దాడుల్లో టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్స్ ఆర్.ప్రకాష్ మరియు కె.శశిధర్ రెడ్డి, సైదాపూర్ సబ్ ఇన్స్పెక్టర్ ప్రశాంత్ రావు, టాస్క్ ఫోర్స్ సబ్ ఇన్స్పెక్టర్స్ పి.కరుణాకర్, నరేష్ రెడ్డి మరియు బి.స్వామి, టాస్క్ ఫోర్స్ ఏఎస్ఐ-నరసయ్య లతో పాటు టాస్క్ ఫోర్స్ మరియు సైదాపూర్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.